

# జై భీమ్
తెలుగు దినపత్రిక
POWER OF PEOPLE

సమస్యలపై సమరంగా
Jai Bheem TV STRUGGLE FOR JUSTICE
సామాన్యుడి ఆయుధంగా




సంపుటి - 07 | సంచిక 66 | ఎడిటర్ : బరిగెల శివ | గురువారం 05, ఫిబ్రవరి 2026 | పేజీలు 8 | వెల రూ. 5


పబ్లిషర్స్ తెలంగాణ : హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ : విజయవాడ, ఢిల్లీ, కర్ణాటక, బెంగళూరు, తమిళనాడు, చెన్నై, మహారాష్ట్ర, ముంబై, గోవా, కేరళ, ఉత్తరప్రదేశ్, పజాజ్, పశ్చిమబెంగాల్, అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, దుబాయ్, మస్కట్





# ఆంధ్రాలో అరాచక శక్తుల ఆగడాలు!









● అసాంఘిక శక్తులను పెంచి పోషిస్తున్న కూటమి నేతలు ● పగలతో రెచ్చిపోతూ ప్రతికారాలు తీర్చుకుంటున్నారు ● ప్రజాస్వామ్యంపై కసితీరా పగబడుతున్నారు ● దాడులు చేయడం, ధ్వంసం చేయడం,కూటమిపాలనలో కొత్త పథకమా ! ● అఫెన్స్ కు డిఫెన్స్ కు తేడా తెలియకుండా కేసులు కడుతున్న ఆంద్రా పోలీసులు ● ప్రజల విశ్వాసంతో పని లేకుండా కక్షలు చూపిస్తున్నారు ● తిరుపతి లడ్డులో నెయ్యి కల్తీ అని నెత్తినోరు మొక్కుకున్నారు ● ఆంధ్రాలో భయానక వాతావరణ పాలన జరుగుతుంది ● తిరుపతి లడ్డు కేసును సిబిఐ ఛార్జ్ షీట్ ద్వారా క్లోజ్ చేసింది ● కులమతాలను రెచ్చగొడుతూ విధ్వంసాలను సృష్టిస్తున్నారు ● వెంకటేశ్వర స్వామి ప్రతిష్టతో రాజకీయాలు చేస్తున్నారు ? ● డాక్టర్ బరిగెల శివ

హైదరాబాద్ (జై భీమ్ డెస్క్)

నిరంకుశ పాలనకు అద్దం పట్టేలా సాగుతున్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పాలన భారతదేశ వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారిందని డాక్టర్ బరిగెల శివ తీవ్రంగా హెచ్చరించారు.ప్రజలకు రక్షణ కల్పించాల్సిన ప్రభుత్వం కర్రలతో మారణాయుదాలతో విధ్వంసాలు సృష్టింపజేసే స్థాయికి దిగజారడం రాష్ట్ర పాలనలో ప్రజలు తీవ్రమైన ఒత్తిడిని ఎదుర్కొంటున్నారన్నారు.సూపర్ సిక్స్ పథకాలను ప్రశ్నిస్తున్న ప్రతి నాయకున్ని కక్షగట్టి వెంటాడి.... వెంటాడి... దాడులు చేయిస్తున్న కూటమి ప్రభుత్వం

- మిగతా 2లో..










డాక్టర్ బరిగెల శివ
జై భీమ్ సంస్థల ఫౌండర్, చైర్మన్



## కేసీఆర్.. నువ్వెలా జాతిపిత అవుతావు?: రేవంత్ రెడ్డి

పదేళ్లు అధికారంలో ఉండి రాష్ట్రాన్ని దోచుకున్నారని మండిపాటు

మొగుడు పెళ్లాం మాట్లాడుకున్నా ఫోన్ ట్యాపింగ్ చేశారని ఆగ్రహం

బీఆర్ఎస్ నాయకులు దోపిడీదారులు అంటూ విమర్శలు



2

## తెలంగాణలో సనాతన ధర్మంపై జరిగే దాడులను సహించేది లేదు: నితిన్ నబీన్ హెచ్చరిక

ముస్లిం ఓటు బ్యాంకు కోసం కాంగ్రెస్ ఆరాటపడుతోందని ఆరోపణ

హిందూ దేవాలయాలపై దాడులు జరుగుతుంటే నోరు మెదపడం లేదని ఆగ్రహం

రేవంత్ రెడ్డి ప్రభుత్వం బుజ్జగింపు రాజకీయాలు చేస్తోందని విమర్శలు

2



## అసభ్యకర కామెంట్లు..

బంజారాహిల్స్ పోలీసులను ఆశ్రయించిన సినీ నటి ఈషా రెబ్బ

3

## లోన్ కట్టలేదని వేధిస్తే బ్యాంకులపై చర్యలు తప్పవు..!

గూండాల్లా ప్రవర్తిస్తే లైసెన్స్ రద్దుకూ వెనుకాడం: సుప్రీంకోర్టు హెచ్చరిక

2






## అంబటి రాంబాబు ఇంటికి వెళ్లిన జగన్

కూటమి ప్రభుత్వంపై ఆగ్రహం

మాజీ మంత్రి అంబటి రాంబాబు కుటుంబాన్ని పరామర్శించిన జగన్

రాష్ట్రంలో జంగిల్ రాజ్ నడుస్తోందని ప్రభుత్వంపై తీవ్ర ఆగ్రహం

మూడేళ్లలో తిరిగి అధికారంలోకి వస్తామని కూటమికి ఘాటు హెచ్చరిక

టీడీపీ శ్రేణుల దాడిలో ధ్వంసమైన అంబటి ఇంటిని, వాహనాలను పరిశీలన

తిరుమల నెయ్యి వివాదంపై స్పందిస్తూ చంద్రబాబుపై విమర్శలు

7

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE

# లోన్ కట్టలేదని వేధిస్తే బ్యాంకులపై చర్యలు తప్పవు..!

**గూండాల్లా ప్రవర్తిస్తే లైసెన్స్ రద్దుకూ వెనుకాడం: సుప్రీంకోర్టు హెచ్చరిక**




**న్యూ ఢిల్లీ..జై భీమ్ న్యూస్,**

లోన్ వాయిదాలు ఆలస్యమయ్యాయని చెప్పి రికవరీ ఏజెంట్లు రుణగ్రహీతలను మానసికంగా వేధించడం, బూతులు తిట్టడం, బంధువులకు ఫోన్లు చేసి పరువు తీయడం వంటి చర్యలు చట్టవిరుద్ధమని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. ఈ తరహా అక్రమాలకు పాల్పడితే సంబంధిత బ్యాంకులపై కఠిన చర్యలు తీసుకునే అధికారం రిజర్వు బ్యాంకుకి ఉందని కోర్టు హెచ్చరించింది. అప్పు తీసుకోవడం నేరం కాదని, అది కేవలం ఒప్పందం మాత్రమేనని పేర్కొన్న న్యాయస్థానం, రికవరీ ప్రక్రియ చట్టబద్ధమైన పద్ధతిలోనే జరగాలని స్పష్టం చేసింది. భయపెట్టడం, బెదిరించడం, వ్యక్తిగత గోప్యతకు భంగం కలిగించడం వంటి చర్యలను ఏమాత్రం సహించబోమని తేల్చిచెప్పింది. ఈ కీలక తీర్పు శాంతి ప్రసాద్ వర్సెస్ యూనియన్ బ్యాంకు అఫ్ ఇండియా ఇతరులు కేసులో వెలువడింది. రికవరీ ఏజెంట్లు గూండాల్లా ప్రవర్తిస్తే ఆ బ్యాంక్ బాధ్యత నుంచి తప్పించుకోలేదని, అవుట్‌సోర్సింగ్ పేరుతో బాధ్యత నుంచి తప్పించుకోవడం కుదరదని కోర్టు స్పష్టం చేసింది. రికవరీ ఏజెంట్లు ఉదయం 8 గంటల ముందు, రాత్రి 7 గంటల తర్వాత ఫోన్ చేయరాదని, రుణగ్రహీత అనుమతి లేకుండా ఇంటికి వెళ్లకూడదని కోర్టు గుర్తు చేసింది. ఈ నిబంధనలు ఉల్లంఘిస్తే అది వ్యక్తిగత స్వేచ్ఛకు భంగం కలిగించినట్లేనని పేర్కొంది. ఈ వ్యవహారంలో బాధితుడికి ?5 లక్షల పరిహారం చెల్లించాలని సంబంధిత బ్యాంకును ఆదేశించిన ధర్మాసనం, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతమైతే భారీ జరిమానాలు విధిస్తామని హెచ్చరించింది. ఈ తీర్పును జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ కే వీ విశ్వనాథన్ ల ధర్మాసనం వెలువరించింది.

# తెలంగాణలో సనాతన ధర్మంపై జరిగే దాడులను సహించేది లేదు: నితిన్ నబీన్ హెచ్చరిక

**ముస్లిం ఓటు బ్యాంకు కోసం కాంగ్రెస్ ఆరాటపడుతోందని ఆరోపణ**

**హిందూ దేవాలయాలపై దాడులు జరుగుతుంటే ద**

**నోరు మెదపడం లేదని ఆగ్రహం**

**రేవంత్ రెడ్డి ప్రభుత్వం బుజ్జగింపు రాజకీయాలు చేస్తోందని విమర్శలు**

**ఢిల్లీ, జై భీమ్ న్యూస్**

రాష్ట్రంలో సనాతన ధర్మం మీద జరిగే దాడులను ఎట్టి పరిస్థితుల్లో సహించబోమని బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ హెచ్చరించారు. మహబూబ్ నగర్‌లోని ఎంవీఎస్ డిగ్రీ కళాశాల మైదానంలో జరిగిన 'విజయ సంకల్ప్' సమ్మేళనంలో ఆయన మాట్లాడుతూ, ముస్లిం ఓటు బ్యాంకు కోసం కాంగ్రెస్ ఆరాటపడుతోందని మండిపడ్డారు. రాష్ట్రంలో హిందూ దేవాలయాలపై దాడులు జరుగుతున్నా నోరు మెదపడం లేదని, ఆలయాల భూములు ఆక్రమిస్తున్నారని ఆరోపించారు. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ఎందరో పోరాడారని అన్నారు. హైదరాబాద్ విముక్తి కోసం సర్దార్ వల్లభాయ్ పటేల్ కృషి చేశారని అన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం బుజ్జగింపు రాజకీయాలు చేస్తోందని ఆరోపించారు. వక్ఫ్ బోర్డును బలోపేతం చేసేందుకు చూస్తోందని అన్నారు. బలహీనవర్గాలకు న్యాయం జరగలేదని, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ పథకాల నిధుల్లో ప్రభుత్వం కోత విధిస్తోందని ఆరోపించారు. ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. ఎన్నికల హామీలను తుంగలో తొక్కిందని మండిపడ్డారు. రైతు భరోసా, రుణమాఫీ, వ్యవసాయ కూలీలకు ఇచ్చిన హామీలు కూడా నెరవేరలేదని అన్నారు. ఎస్సీలు, ఆదివాసీలు, బీసీలను తెలంగాణ ప్రభుత్వం మోసం చేసిందని విమర్శించారు. రాష్ట్రంలో అభివృద్ధి పనులు, బిల్లుల మంజూరుకు ఆర్ఆర్ ట్యాక్స్ చెల్లించవలసి వస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. అవినీతి, కమీషన్ల ప్రభుత్వాన్ని కూకటివేళ్లతో పెకిలించాలని అన్నారు. ప్రతి ఒక్కరికి న్యాయం జరగాలంటే మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు ప్రాధాన్యత ఇస్తోందని, అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. తెలంగాణలో రైల్వే పనులకు రూ.5,400 కోట్లకు పైగా కేటాయించామని, మూడు హైస్పీడ్ రైల్ రైళ్లను ఇచ్చామని గుర్తు చేశారు. ప్రపంచవ్యాప్తంగా మోదీ ప్రభుత్వం పట్ల ఆదరణ పెరుగుతోందని అన్నారు. ఈయూతో ఒప్పందం చేసుకుని దేశాభివృద్ధికి కృషి చేస్తున్నామని అన్నారు.

# తెలంగాణలో కొత్త విద్యుత్ కనెక్షన్ల జారీలో మార్పులు

**కొత్త మార్గదర్శకాలు జారీ చేసిన విద్యుత్ నియంత్రణ మండలి**

**గతంలో దూరాన్ని బట్టి ఫీజు వసూలు చేసేవారు**

**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

తెలంగాణలో విద్యుత్ కొత్త కనెక్షన్ల జారీలో రేపటి నుంచి భారీ మార్పులు చోటు చేసుకోనున్నాయి. రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి ఇందుకోసం కొత్త మార్గదర్శకాలను జారీ చేసింది. గతంలో స్తంభాలు, లైన్స్ కోసం వినియోగదారుల నుంచి దూరాన్ని బట్టి ఒక్కో విధంగా ఫీజు వసూలు చేసేవారు. రేపటి నుంచి ఫిక్స్డ్ ఛార్జీలు ఉండనున్నాయి. గృహ విద్యుత్ కనెక్షన్లకు 1 కిలో వాట్ వరకు రూ.500 వరకు వసూలు చేస్తారు. 1 కిలో వాట్ నుంచి 5 కేవీ వరకు రూ.500 వసూలు చేస్తారు. ఆపై ప్రతి అదనపు కిలో వాట్‌కు రూ.600 చొప్పున వసూలు చేస్తారు. 5 కిలో వాట్ల నుంచి 20 కిలో వాట్ల వరకు రూ.2,900 వసూలు చేస్తారు. అక్కడ్నించి ప్రతి అదనపు కిలో వాట్‌కు రూ.1,500 చొప్పున వసూలు చేస్తారు. 20 కిలో వాట్లు ఆ పైన.. రూ.10,000 వసూలు చేయనున్నారు. వాణిజ్య కనెక్షన్లు అయితే 1 కిలో వాట్ వరకు రూ.1,000 వసూలు చేస్తారు.



# ఆంధ్రాలో అరాచక శక్తుల ఆగడాలు







మొదటి పేజీ తరువాయి

సమాజానికి ఏం సమాధానం చెప్పాలనుకుంటుందో తెలియదు గానీ ప్రజాస్వామ్యంపై మాత్రం ఎన్నడూ లేని విధంగా కక్షగడుతుందని ఆంధ్రప్రదేశ్లో జరుగుతున్న దాడులు స్పష్టం చేస్తున్నాయన్నారు.తిరుపతి వెంకటేశ్వర స్వామి ఆలయానికి సంబంధించిన లడ్డులో ఉపయోగిస్తున్న నెయ్యి కల్తీ జరిగిందని అందులో జంతువుల కొవ్వు,గొడ్డు మాంసం కొవ్వు, పంది కొవ్వు, చేపల నూనె కలిశాయని పలు రకాల అభియోగాలు చేసి వైఎస్ఆర్సిపి ప్రభుత్వంపై ఎక్కడ లేని నిందలు వేసి పత్రికా ముఖంగా బహిరంగ ప్రదేశాల్లో నీచాతి నీచమైన మాటలు మాట్లాడడమే కాకుండా తిరుపతి వెంకటేశ్వర స్వామి ప్రతిష్టను రాజకీయాల కోసం వాడుకోవడం దేశ చరిత్రలో కక్ష చర్యల సాగింపులో భాగంగా ప్రధాన ఘట్టంగా చూడాల్సి ఉందన్నారు.గతంలో అందరూ అభియోగాల మోపారని పత్రికలు కూడా వాటిని విమర్శించాయని అలాంటి సవాళ్లను ఎదుర్కొంటూ వైఎస్ఆర్సిపి పార్టీ తరఫున వైవి సుబ్బారెడ్డి సుప్రీంకోర్టులో కేసు వేయగా సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ సంస్థ(సిబిఐ) ఎన్ డిడిబి,ఎన్ డిఆర్ఐ,పరిశోధక సంస్థలచే విచారణ జరిపించి లడ్డు కోసం ప్రయోగిస్తున్న నెయ్యిని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మోపిన అభియోగాలను ప్రభుత్వం నుంచే శాంపుల్ సేకరించి విచారించి లడ్డులో ఎలాంటి కల్తీ జరగలేదని నూనెలో అపశృతి సంభవించలేదని తేల్చి నిర్ధారించి కేంద్ర పరిశోధక నివేదికల ఆధారంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మోపిన కేసులపై చార్జి షీట్ దాఖలాలు చేస్తూ క్లీన్ చీట్‌తో కూడిన నివేదికను సుప్రీంకోర్టుకు సమర్పించి కేసును మూసివేసిందన్నారు. అయినప్పటికీ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అత్యవసర క్యాబినెట్ సమావేశం నిర్వహించి లడ్డులో కల్తీ జరిగిందని ప్రభుత్వం తరఫున కమిటీ వేయాలని నిర్ధారించడంతోపాటు సిబిఐ చార్జ్ షీట్ లో పొందుపరిచిన సత్యాన్ని తప్పుపడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రజల్ని తెలుగు ప్రజలని దేశ ప్రజలను తప్పుదోవ పట్టించడం కోసం కుట్రలు చేస్తుండడం సహించరానిది అన్నారు.ఒకవైపు మెడికల్ కళాశాలను పిపిపి పేరు మీద అభివృద్ధి అంటూ ఆంక్షలు విధిస్తుండడమే కాకుండా ప్రైవేటీకరణకు సిద్ధపడ్డ కూటమి ప్రభుత్వం దేశవ్యాప్తంగా విమర్శల పాలైందన్నారు.లెక్కలేనన్ని అబద్ధాలతో ప్రజలను మభ్యపెడుతూ ప్రభుత్వ పథకాలను అమలు పరచకుండా కొనసాగుతున్న పరిపాలనపై ప్రశ్నిస్తున్న వ్యక్తులను ప్రతిపక్షాల నేతలపై విచక్షణ రహితంగా మూకుమ్మడి దాడులు చేయిస్తూ ప్రజాస్వామ్యాన్ని ప్రభుత్వ కబంధ హస్తాల్లో బంధించి ప్రభుత్వ అధికారులతో ప్రజలను వేధిస్తుందన్నారన్నారు.సంవత్సరన్నర కాలం పాటుగా జంగల్ రాజ్ పాలన కొనసాగిస్తున్నారని మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి బుధవారం మాజీ మంత్రి అంబటి రాంబాబు కుటుంబాన్ని పరామర్శించిన సందర్భంలో పత్రికా సమావేశం ఏర్పాటు చేసి కూటమి ప్రభుత్వంపై తీవ్రంగా విరుచుబడిన విధానం రాష్ట్ర ప్రజల్ని ఒక్కసారిగా కదిలించిందన్నారు.రాష్ట్రంలో భయానకమైన వాతావరణము సృష్టిస్తున్న కూటమి ప్రభుత్వం మణిపూర్ లాంటి ప్రాంతాన్ని బీహార్ లాంటి ప్రాంతాన్ని తలపించేలా చేస్తూ మతాలను రెచ్చగొడుతూ క్రైస్తవ చర్చిలను కూల్చివేస్తూ క్రైస్తవ సంఘాల పాస్టర్లను విశ్వాసులను దళితులను విధ్వాంశమైన దాడులకు గురిచేసి తీవ్రమైన ,భయంకరమైన,వాతావరణాన్ని నిర్మిస్తూ కూటమి ప్రభుత్వం అభద్రత భావంలోనికి నెట్టి వేయబడిందన్నారు.మాజీ మంత్రి రాంబాబు,జోగి రమేష్,విడుదల రజిని,బ్రహ్మానాయుడు,గోవర్ధన్, లాంటి ప్రధాన నేతలపై నేరుగా దాడులు చేయిస్తూ ప్రజాస్వామ్యాన్ని అప్రతిష్ట పాలు చేస్తున్నారన్నారు.నడిరోడ్లపై కూటమి నేతలు కర్రలతో ప్రతిపక్ష నేతలను దాడులు చేస్తూ వాహనాలను నివాసాలను పార్టీ కార్యాలయాలను నివాసాల్లోని ప్రధాన వస్తువులను ఎక్కడికి అక్కడ కూల్చివేసి పగలగొడుతూ,పెట్రోల్ పోసి కాలబెడుతూ, కూటమి ప్రభుత్వంపై ప్రశ్నిస్తే దాడులు ఈ రకంగా ఉంటాయని ఇతర నేతలను భయభ్రాంతులకు గురి చేయడం తెలుగు రాష్ట్రాల్లో విపరీతమైన విమర్శలు తలెత్తబడుతున్నాయన్నారు. విడుదల రజిని మాజీ మహిళా మంత్రి అని చూడకుండా దాడి చేయడం ఆంధ్ర కూటమి ఆగడాలు పరాకాష్టకు చేరినట్టుగా కనిపిస్తున్నాయన్నారు. మహిళలను గౌరవించుకుంటామని సభలపై మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తెలుగు మహిళలకు ఏమని సమాధానం ఇస్తారన్నారు.దాడులకు ప్రతి దాడులకు తేడాలు తెలియకుండా కేసులు కడుతున్న ఆంధ్ర పోలీసులు పోలీసు వ్యవస్థ ప్రతిష్టను ఏం చేయదల్చారో ప్రజలకు కాకపోయినా న్యాయస్థానాలకు ఆధారాలతో సహా తెలియజేయాల్సిన సమయం వచ్చినప్పుడు ముఖం ఎటువైపు మరల్చుకుంటారో గమనించాల్సిన అవసరం ఉందన్నారు.పోలీసుల సమక్షంలోనే పోలీసుల ఆధ్వర్యంలో ప్రతిపక్ష నేతలను సామాన్య నేతలను క్రైస్తవులను షెడ్యూల్ కులాలకు చెందిన ప్రజలను భయానాతి భయంకరంగా దాడులు చేయిస్తుంటే పోలీసు వ్యవస్థ పాటించాల్సిన పద్ధతులు ఇవేనా అంటూ నిలదీశారు.శాంతి భద్రతలను రక్షిస్తూ గొడవలను సభిమన్గించాల్సిన పోలీసులు ప్రేక్షక పాత్ర వహించిన తీరు. నీచాతి నీచంగా ఉందన్నారు.కూటమి ప్రభుత్వం అవలంబిస్తున్న విధివిధానాలను టిడిపి పార్టీ నేతలతో పాటు జనసేన పార్టీ నేతలు తీవ్రంగా ఖండించడం పరిగణలోనికి తీసుకొని ప్రధాన నేతలు కనులు తెరుచుకొని మేలుకోవాలన్నారు.జనసేన పార్టీ అధికార ప్రతినిధి అడ్వకేట్ రజిని ప్రజాస్వామ్యాన్ని రక్షించాలనే భాగంలో కూటమి ఆగడాలను తీవ్రంగా ప్రశ్నిస్తూ న్యాయవాదిగా అట్టి దుశ్చర్యలను తీవ్రంగా తప్పుపడుతూ జనసేన పార్టీ అధికార పదవి నుండి తప్పుకుంటున్నట్లు ప్రకటించడం ప్రజాస్వామ్యం గర్వపడేలా ఉందన్నారు.ఒకవైపు ప్రైవేట్ సంస్థలకు వేలకోట్లు విలువచేసే భూములను 99 పైసలకే ధారాధత్తం చేస్తూ రాష్ట్ర ఆస్తులను కొల్లగొడుతున్న కూటమి ప్రభుత్వం ఆంధ్ర ప్రజలపై కక్షలతో,కర్రలతో,బూతులతో,మతవిద్వేషాలతో,మారణాయుధాల దాడులతో,ప్రజాస్వామ్య అణిచివేత దాడులతో,ప్రజల ప్రాణాలతో చెలగా టాలాడుతు దాడులే ప్రధానం అణచివేతే ప్రాముఖ్యం అనే సూత్రాన్ని తూచా తప్పకుండా పాటిస్తూ పోలీస్ వ్యవస్థను ప్రజల ముందు అభాసుపాలు చేస్తూ అక్రమ కేసులను కట్టిస్తుండడం న్యాయస్థానాలను తప్పుపట్టిస్తుంతుండడం గమనిస్తుంటే కేంద్రం సహకారంతో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాన్ని ప్రజా వికృత పాలనగా చేస్తుండడమే కాకుండా ప్రజలను వంచిస్తూ వాళ్లకు తోచిన విధంగా పాలన చేస్తున్నారన్నారు.పోలీసుల సమక్షంలో జరుగుతున్న ప్రతి దాడి రికార్డ్స్ చేయబడుతూ ఉంటుండగా బాధ్యత వహించాల్సిన పోలీసులు దాడులు చేయబడ్డ నాయకులపై వ్యక్తులపై అకారణంగా అక్రమ కేసుల్లో ఇరికించి జైల్లోకి పంపడాన్ని తీవ్రంగా తప్పు పట్టారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో ఇదే రకమైన దాడులు జరుగుతుండగా జిల్లాల్లో కేంద్రంగా ఉన్నటువంటి పోలీసు ఉన్నత కార్యాలయాలు కూటమి ప్రభుత్వానికి పూర్తిగా సహకరిస్తూ ప్రజారక్షణ ప్రజల భద్రతను గాలికి వదిలేసి బాధ్యతారహిత్యంగా వ్యవహరిస్తున్నారని తెలుగు ప్రజలు ముక్తకంఠంతో మొత్తుకుంటున్నారన్నారు.సంవత్సరం నరకాలానికే ఇంతటి దుర్మార్గాలకు పాల్పడితే రానున్న కాలం ఎంత భయంకరంగా పాలిస్తారో గమనిస్తుంటే ప్రజలు తిరుగుబాటుతో సమాధానం చెప్పడానికి సిద్ధపడుతున్నారన్నారు.ఒకే ఒక్క నాయకుడు మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డిని చూసి ఇంతలా భయపడుతున్న కూటమి నేతలు వారు నిర్వహిస్తున్న ప్రతి దాడి లెక్కలు వేయబడుతున్నాయని మర్చిపోవద్దన్నారు.ప్రజలకు మేలు చేయడం కోసం ప్రజలను అభివృద్ధి చేయడం కోసం ప్రజాస్వామ్య విలువలను కాపాడడం కోసం ఏర్పాటు చేయబడిన ప్రభుత్వాలు చేస్తున్న పాలనేమిటో వాళ్ళు చేయిస్తున్న దాడులేమిటో ప్రజలందరూ గమనిస్తుండగా ఇకనైనా నిరంకుశ పాలనను మాని నిజాయితీ పాలనకు మార్గాలు వేయండంటూ సూచించారు.దాడులే ప్రధానం అనుకుంటే ప్రతి దాడులు సంభవించే రోజు ఇంతకన్నా తీవ్రమైన పరిస్థితులను ప్రస్తుత నాయకులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నది ఆంధ్రప్రదేశ్ ప్రజలందరూ ముక్తకంఠంగా హెచ్చరిస్తున్నారన్నారు.ప్రజాస్వామ్యంలో తప్పు చేసిన వ్యక్తులను శిక్షించడానికి చట్టాలు న్యాయస్థానాలు ఉన్నత స్థాయిలో పనిచేస్తుండగా వాటిని కాదని ప్రభుత్వాలే దాడులు చేయిస్తుంటే ప్రభుత్వంపై ప్రజల్లో దినదినానికి తిరుగుబాటు ఎదురుదాడి వ్యతిరేకత అంతే స్థాయిలో పెరిగిపోతాయన్నారు.

# కేసీఆర్.. నువ్వేలా జాతిపిత అవుతావు?: రేవంత్ రెడ్డి

**పదేళ్లు అధికారంలో ఉండి రాష్ట్రాన్ని దోచుకున్నారని మండిపాటు**

**మొగుడు పెళ్లాం మాట్లాడుకున్నా ఫోన్ ట్యాపింగ్ చేశారని ఆగ్రహం**

**బీఆర్ఎస్ నాయకులు దోపిడీదారులు అంటూ విమర్శలు**

**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

"భార్యాభర్తలు మాట్లాడుకుంటే దొంగచాటుగా విన్న సన్నాసివి, నువ్వేలా జాతిపిత అవుతావు?" అని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై సీఎం రేవంత్ రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఫోన్ ట్యాపింగ్ కేసును ఉద్దేశించి ఆయన ఘాటు వ్యాఖ్యలు చేశారు. నల్గొండ జిల్లా మిర్యాలగూడలో బుధవారం జరిగిన 'ప్రజా పాలన ప్రగతిబాట' భారీ బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా కేసీఆర్ కుటుంబంపై, బీఆర్ఎస్ నేతలపై నిప్పులు చెరిగారు. కొంతమంది 'జాతిపిత'ను విచారిస్తారా అని అడుగుతున్నారని, అసలు "ఎవరికిరా నువ్వు జాతిపిత? నీ జాతికి నువ్వు పిత కావొచ్చు.. మాకు కాదు" అని రేవంత్ రెడ్డి అన్నారు. "ఆంధ్రప్రదేశ్‌లో పార్టీ మొత్తం కనుమరుగైనా తెలంగాణ ప్రజల ఆకాంక్షను నెరవేర్చిన సోనియమ్మ తెలంగాణ తల్లి అవుతుంది. తెలంగాణ కోసం సర్వం త్యాగం చేసిన ప్రొఫెసర్ జయశంకర్ జాతిపిత అవుతాడు. లులి, సన్నాసి, దొంగ అయిన నువ్వేలా జాతిపిత అవుతావు?" అంటూ కేసీఆర్‌ను ఉద్దేశించి తీవ్ర పదజాలంతో విమర్శించారు. ఫోన్ ట్యాపింగ్ అంశంపై మాట్లాడుతూ.. "అన్నం తినేవాళ్లు ఎవరైనా భార్యాభర్తలు మాట్లాడుకుంటే వింటారా? సిగ్గుతో తలదించుకోవాలి. నిజానికి కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు ముఖాలకు ముసుగులు తొడిగి పోలీసులు విచారణకు తీసుకురావాల్సింది" అని వ్యాఖ్యానించారు. తాము జాతిపిత అయితే కేసీఆర్ ఎర్రవల్లి ఫామ్‌హౌస్, కేటీఆర్ జన్వాడ ఫామ్‌హౌస్, హరీశ్‌రావు మొయినాబాద్ ఫామ్‌హౌస్‌లతో పాటు వేల కోట్ల ఆస్తులను తెలంగాణ ప్రజలకు రాసిస్తారా అని సవాల్ విసిరారు. తెలంగాణ ఉద్యమకారుడు శ్రీకాంతాచారి తల్లి శంకరమ్మకు కనీసం చిన్న పదవి కూడా ఇవ్వలేదని ఆరోపించారు. సభకు ముందు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మిర్యాలగూడలో రూ.200 కోట్లతో నిర్మించ తలపెట్టిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌కు శంకుస్థాపన చేశారు. అనంతరం మహిళా సంఘాలకు చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే భాస్కర్ రావును 'నమ్మకద్రోహి', 'నక్క జిత్తుల వ్యక్తి' అని అభివర్ణించారు. "జానారెడ్డి చెప్పులు, నీళ్లసీసాలు మోసిన భాస్కర్‌రావు, ఎమ్మెల్యేగా గెలిచాక ఆత్మగౌరవాన్ని ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో కేసీఆర్ పాదాల దగ్గర పెట్టాడు. అలాంటి వ్యక్తికి మళ్లీ ఓటేస్తారా? గంగిరెద్దుల్లా ఓట్లు అడగడానికి వస్తే కర్రు కాల్చి వాత పెట్టండి" అని ప్రజలకు పిలుపునిచ్చారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చూసి మున్సిపల్ ఎన్నికల్లో తీర్పు ఇవ్వాలని ప్రజలను కోరారు. "పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదు. మేము లక్షలాది కార్డులిచ్చి సన్న బియ్యం అందిస్తున్నాం. ప్రతి ఇంటికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, రైతులకు ఎకరానికి రూ.6 వేల రైతు భరోసా, రూ.500 బోనస్‌తో పాటు రుణమాఫీ చేశాం. 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశాం" అని ప్రభుత్వ విజయాలను వివరించారు. ఓటు వేసే ముందు ఈ పథకాలన్నింటినీ గుర్తు చేసుకోవాలని కోరారు. మున్సిపల్ శాఖ తన వద్దే ఉందని, కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపిస్తే పట్టణాలను అద్దంలా తీర్చిదిద్దే బాధ్యత తనదని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఎంపీ రఘువీర్ రెడ్డి, ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు.



# మీడియా సెంటర్‌ను ప్రారంభించిన జిల్లా కలెక్టర్






**వరంగల్, 04 ఫిబ్రవరి 2026(జై భీమ్ న్యూస్)**

మునిసిపల్ ఎన్నికలను పురస్కరించుకుని వరంగల్ జిల్లా కార్యాలయాల ప్రాంగణంలోని డిపిఆర్ఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సెంటర్, మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ సెల్ (ఎం.సీ.ఎం.సీ)లను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ సత్య శారద బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మీడియా సెంటర్‌లో మీడియా ప్రతినిధులకు అందుబాటులో ఉన్న సదుపాయాలు, ఎంసిఎంసి సెల్ విధుల నిర్వహణకు చేపట్టిన ఏర్పాట్లను కలెక్టర్ పరిశీలించారు. జిల్లాలో జరుగుతున్న నర్సంపేట, వర్ధన్నపేట మునిసిపల్ ఎన్నికలకు సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు మీడియా సెంటర్ ద్వారా ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాకు అందించాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లా స్థాయిలో మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ సెల్‌ను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ సెల్ ద్వారా చెల్లింపు వార్తలను గుర్తించడం, ప్రచార ప్రకటనలకు సకాలంలో అనుమతులు మంజూరు చేయడం జరుగుతుందని వివరించారు. అలాగే సోషల్ మీడియాలో వచ్చే పోస్టులను నిరంతరం పర్యవేక్షిస్తూ, ఎన్నికల ప్రవర్తన నియమావళిని ఉల్లంఘించే అంశాలపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. పారదర్శకంగా, నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించేందుకు మీడియా సహకారం ఎంతో కీలకమని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీఆర్ఓ విజయలక్ష్మి, జెడ్పి సీఈఓ రామిరెడ్డి, డిపిఆర్ఓ ఆయుబ్ అలీ, ఆర్డీఓ సుమా, డిపిఓ కల్పన, డిబిసిడిఓ పుష్పలత, అదనపు పీఆర్ ఓ ప్రేమలతతో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

# సామాజిక వివక్షను ప్రశ్నించడమే విద్యార్థుల కర్తవ్యం







కేయూ రిజిస్ట్రార్ ప్రొ. వి. రామచంద్రం


**వరంగల్, ఫిబ్రవరి 4, 2026 (జై భీమ్ న్యూస్)**

నేటి భారతీయ సమాజంలో పాతుకుపోయిన కుల వివక్ష, అసమానతలను ప్రశ్నించడమే యూనివర్సిటీ విద్యార్థుల ప్రధాన కర్తవ్యమని కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వి. రామచంద్రం స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తొలిసారిగా నిర్వహిస్తున్న “తెలంగాణ సామాజిక న్యాయ దినోత్సవం” సందర్భంగా కాకతీయ యూనివర్సిటీ రాజకీయ శాస్త్ర విభాగం సెమినార్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సభకు బీసీ సెల్ డైరెక్టర్ డా. బి. సతీష్ అధ్యక్షత వహించారు. ప్రొ. రామచంద్రం మాట్లాడుతూ---సామాజిక న్యాయ భావన సాధారణంగా ఏర్పడలేదని, దశాబ్దాల తరబడి దళితులు, బడుగు, బలహీన వర్గాలు సాగించిన త్యాగపూరిత పోరాటాల ఫలితమేనని గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్రంలో కుల గణన, ఎస్సీ ఉప-వర్గీకరణ వంటి కీలక సంస్కరణల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల మేరకు, 2024 నవంబర్--డిసెంబర్‌లో కుల గణన నిర్వహించబడిందని, ఎస్సీ ఉప-వర్గీకరణ కోసం ఏకసభ్య న్యాయ కమిషన్‌ను నియమించారని వివరించారు. ఫిబ్రవరి 4న ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ప్రత్యేక అసెంబ్లీ సమావేశాన్ని ఏర్పాటు చేసి ఈ అంశాలపై తీర్మానాలు ఆమోదింపజేయడం చారిత్రాత్మక ఘట్టమని పేర్కొన్నారు. ఆధునిక భారతదేశ సామాజిక న్యాయానికి శిల్పిగా నిలిచిన డా. బి.ఆర్ అంబేద్కర్ కుల వివక్ష, అంటరానితనానికి వ్యతిరేకంగా సాగించిన ఉద్యమాలను స్మరించుకుంటూ---దళితులు, వెనుకబడిన వర్గాలు, మహిళలకు సమాన హక్కులు కల్పించడమే ఆయన జీవిత లక్ష్యమని చెప్పారు. అలాగే సామాజిక సంస్కరణల పయనంలో జ్యోతిరావు పూలే, సావిత్రీబాయి పూలే, పెరియార్ ఈ.వి. రామస్వామి నుంచి మంద కృష్ణ మాదిగ వరకూ క్రింది కులాల విముక్తి కోసం చేసిన పోరాటాలు ఈ దినోత్సవానికి ప్రేరణగా నిలిచాయని అన్నారు. కార్యక్రమంలో మరో అతిథిగా పాల్గొన్న పరీక్షల నియంత్రణాధికారి ప్రొ. కట్ల రాజేందర్ మాట్లాడుతూ---సమాజంలో సగానికి పైగా ఉన్న దళిత, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు రాజ్యాంగం కల్పించిన హక్కులను ఎలాంటి వివక్ష లేకుండా అమలు చేయడమే నిజమైన “సామాజిక న్యాయ దినోత్సవం”గా భావించవచ్చని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ పాలకమండలి సభ్యులు డా. చిర్ర రాజు, రాజకీయ శాస్త్ర విభాగాధిపతి డా. సంకినేని వెంకటయ్య, తెలుగు విభాగాధిపతి డా. మామిడి లింగయ్య, బీసీ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షులు డా. గడ్డం కృష్ణ, డా. సదాశివుడు, టీ. వెంకటేష్, డా. సాదు రాజేష్, డా. వెంకట్ గోపీనాథ్ తదితరులు, పలువురు అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు భారీగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ఫోన్ ట్యాపింగ్ కేసు: డీఎస్పీ హోదా కోల్పోయిన ప్రణీత్ రావు

**హైద్రాబాద్, 4 ఫిబ్రవరి 2026 (జై భీమ్ న్యూస్)**

ఫోన్ అక్రమ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న, ప్రస్తుతం సస్పెన్షన్‌లో ఉన్న పోలీస్ అధికారి దుగ్యాల ప్రణీత్ రావుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం భారీ షాక్ ఇచ్చింది. ఆయనకు యాక్సిలరేటెడ్ విధానంలో ఇచ్చిన డీఎస్పీ పదోన్నతిని రద్దు చేస్తూ, ఇన్‌స్పెక్టర్ (సీఐ) స్థాయికి తగ్గిస్తూ హోంశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (హోం) ఉత్తర్వుల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారిక వర్గాలు వెల్లడించాయి. ప్రణీత్ రావు డీఎస్పీగా పదోన్నతి పొందిన తరువాత ప్రొబేషన్ కాలంలోనే తీవ్రమైన విధుల దుర్వినియోగానికి పాల్పడ్డారని, ఇది టీఎస్‌సీఎస్ (కండక్ట్) రూల్స్--1964లోని రూల్--3కు విరుద్ధమని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఆయన డీఎస్పీ హోదాను పూర్తిగా రద్దు చేసి ఇన్‌స్పెక్టర్ స్థాయికి డిమోట్ చేశారు. 2007 ఎస్సై బ్యాచ్‌కు చెందిన ప్రణీత్ రావు 2016 అక్టోబరు 24న స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్ (ఎస్ఐబీ)కు బదిలీ అయ్యారు. అక్కడ పనిచేస్తున్న సమయంలోనే ఆయనకు ముందుగా ఇన్‌స్పెక్టర్‌గా, ఆపై యాక్సిలరేటెడ్ విధానంలో డీఎస్పీగా పదోన్నతి లభించింది. సాధారణంగా తీవ్రవాద, ఉగ్రవాద నిరోధక చర్యల్లో అసాధారణ ప్రతిభ కనబరిచిన అధికారులకే ఇలాంటి పదోన్నతులు ఇస్తారని నిబంధనలు ఉన్నప్పటికీ, అలాంటి సేవలు లేకుండానే ఆయనకు డీఎస్పీ పదవి లభించడం అప్పట్లో తీవ్ర వివాదానికి దారితీసింది.



2023 డిసెంబరు 4న, శాసనసభ ఎన్నికల ఫలితాలు వెలువడిన మరుసటి రోజే, హైదరాబాద్‌లోని ఎస్ఐబీ భవనంలో సీసీ కెమెరాలను స్విచ్ ఆఫ్ చేసి, ఎస్ఓటీ (స్పెషల్ ఆపరేషన్స్ టార్గెట్) లాగర్ రూంలో ఉన్న ల్యాప్‌టాప్‌లు, కంప్యూటర్లలోని 42 హార్డ్‌డిస్కుల డేటాను ధ్వంసం చేయడంలో ప్రణీత్ రావు కీలక పాత్ర పోషించినట్లు సిట్ దర్యాప్తులో తేలింది. ఈ ఘటనపై అప్పటి ఎస్ఐబీ డీఐజీ నివేదిక ఇచ్చిన తర్వాత, 2024 మార్చి 2న ప్రణీత్ రావును సస్పెండ్ చేశారు. మార్చి 10న పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో క్రిమినల్ కేసు నమోదు కాగా, మార్చి 12న ఆయనను అరెస్ట్ చేసి జైలుకు పంపారు. అనంతరం డీజీపీ ప్రభుత్వానికి నివేదిక పంపుతూ, “డీఎస్పీగా ప్రొబేషన్‌లో ఉండగానే అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారు” అని పేర్కొన్నారు. ఈ నివేదిక ఆధారంగానే రాష్ట్ర ప్రభుత్వం ఇప్పుడు ఆయన డీఎస్పీ పదోన్నతిని రద్దు చేసింది. తెలంగాణ పోలీస్ శాఖ చరిత్రలోనే తొలిసారిగా ఒక అధికారిని డీఎస్పీ స్థాయి నుంచి ఇన్‌స్పెక్టర్ స్థాయికి తగ్గించడం జరగడం గమనార్హం. ఇది అధికార దుర్వినియోగం, అక్రమ నిఘా చర్యలపై ప్రభుత్వం తీసుకున్న కఠిన వైఖరికి నిదర్శనంగా భావిస్తున్నారు.

# కేయూలో క్యాన్సర్‌పై అవగాహన సదస్సు

**కలుషిత ఆహారం, ప్రాసెస్డ్ ఫుడ్‌లే క్యాన్సర్‌కు ప్రధాన కారణం**
**ప్రొఫెసర్ జి. రామేశ్వరం**



**వరంగల్, ఫిబ్రవరి 4, 2026 (జై భీమ్ న్యూస్)**

కాకతీయ విశ్వవిద్యాలయం (కేయూ)లో క్యాన్సర్‌పై అవగాహన కల్పించేందుకు గురువారం ఒక్కరోజు ప్రత్యేక సదస్సు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం సైకాలజీ విభాగ ఆధ్వర్యంలో జరగగా, విభాగాధిపతి మరియు కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం అధ్యక్షత వహించారు. ఈ సదస్సులో గెస్ట్ లెక్చరర్‌గా పాల్గొన్న ప్రొఫెసర్ జి. రామేశ్వరం మాట్లాడుతూ, నేటి సమాజంలో మనిషి ఎక్కువగా వినియోగిస్తున్న చిరు తినుబండారాలు, బేకరీ ఫుడ్, కృత్రిమ పానీయాలు, కలుషిత ఆహార పదార్థాలే క్యాన్సర్ వంటి ప్రమాదకర వ్యాధులకు ప్రధాన కారణమవుతున్నాయని హెచ్చరించారు. ఇంటి బయట లభించే ఆహారంపై ఆధారపడటం వల్ల శరీరానికి హానికరమైన రసాయనాలు చేరుతున్నాయని పేర్కొన్నారు. ప్రకృతి అందించే సహజ ఆహారాలపట్ల మక్కువ పెంచుకోవాలని, తాజా కూరగాయలు, పండ్లు, సంపూర్ణ ధాన్యాలు, స్వచ్ఛమైన నీటిని ఎక్కువగా వినియోగించాల్సిన అవసరం ఉందని సూచించారు. మార్కెట్లో దొరికే ప్రాసెస్డ్ ఫుడ్, ప్యాకెట్ ఆహారాలు, బేకరీ పదార్థాలు, రంగులు కలిసిన పానీయాలకు దూరంగా ఉండాలని స్పష్టం చేశారు. అలాగే క్యాన్సర్ బారిన పడిన వారు భయపడాల్సిన అవసరం లేదని, ఆధునిక వైద్య విధానాలు, శాస్త్రీయ చికిత్సలు ప్రస్తుతం అందుబాటులో ఉన్నాయని తెలిపారు. తొలిదశలో వ్యాధిని గుర్తిస్తే చికిత్స ద్వారా పూర్తిగా నయం చేసే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని వివరించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ జి. సంపత్ రెడ్డి, డాక్టర్ పి. మాలతి పాల్గొని క్యాన్సర్ నివారణ, ఆరోగ్యకర జీవనశైలి, మానసిక ధైర్యం వంటి అంశాలపై మాట్లాడారు. విద్యార్థులు, అధ్యాపకులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ అవగాహన సదస్సును విజయవంతం చేశారు. క్యాన్సర్‌పై అవగాహనతో పాటు ఆరోగ్యంపై బాధ్యతాయుత జీవనశైలిని అవలంబించాల్సిన అవసరాన్ని ఈ కార్యక్రమం మరోసారి ప్రజలకు గుర్తు చేసింది.

# ఉత్కృష్ట పతకాన్ని అందుకున్న డీసీపీ రాజమహేంద్ర నాయక్




**వరంగల్, 4 ఫిబ్రవరి 2026 (జై భీమ్ క్రైమ్ న్యూస్)**

పోలీస్ విభాగంలో ఉత్తమ సేవలు అందించినందుకు గాను కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ఉత్కృష్ట పతకంను సెంట్రల్ జోన్ డీసీపీ రాజమహేంద్ర నాయక్ బుధవారం అందుకున్నారు. ఈ పతకాన్ని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ సీపీ క్యాంపు కార్యాలయంలో ఘనంగా ప్రదానం చేశారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ డీసీపీ రాజమహేంద్ర నాయక్‌ను అభినందిస్తూ, విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచే అధికారులకు శాఖాపరమైన గుర్తింపుతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల స్థాయిలో కూడా గౌరవం లభిస్తుందని పేర్కొన్నారు. 2010లో డీఎస్పీగా పోలీస్ శాఖలో అడుగుపెట్టిన రాజమహేంద్ర నాయక్, నెల్లూరు జిల్లా, వరంగల్ సీసీఎస్, ములుగు, మహబూబాబాద్ జిల్లాల్లో డీఎస్పీగా సమర్థవంతంగా విధులు నిర్వర్తించారు. 2017లో అదనపు ఎస్పీగా భూపాలపల్లి, అనంతరం ఇంటెలిజెన్స్ విభాగంలో పనిచేశారు. 2021లో ఎస్పీగా పదోన్నతి పొంది, ఇంటెలిజెన్స్ విభాగంలో కీలక బాధ్యతలు నిర్వహించారు. ప్రస్తుతం సెంట్రల్ జోన్ డీసీపీగా బాధ్యతలు చేపట్టి, అనేక కీలక కేసులను విజయవంతంగా ఛేదించి నేర నియంత్రణలో తనదైన ముద్ర వేశారు. ఈ కార్యక్రమంలో వెస్ట్ జోన్ పరిధిలోని పోలీస్ అధికారులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని డీసీపీ రాజమహేంద్ర నాయక్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు. పోలీస్ విభాగంలో ఆయన సాధించిన ఈ ఘనత జిల్లాకే గర్వకారణమని పలువురు పేర్కొన్నారు.

## అసభ్యకర కామెంట్లు.. బంజారాహిల్స్ పోలీసులను ఆశ్రయించిన సినీ నటి ఈషా రెబ్బ

**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

ప్రముఖ సినీ నటి ఈషా రెబ్బ బంజారాహిల్స్ పోలీసులను ఆశ్రయించారు. తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో తాను పెట్టిన పోస్టు కింద అసభ్యకర కామెంట్లు పెట్టిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆమె పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఒక వ్యక్తి ఫేక్ అకౌంట్ ద్వారా అసభ్యకరమైన కామెంట్లు పెడుతున్నారని చెబుతూ ఆ అకౌంట్‌కు సంబంధించిన వివరాలను అందించారు. బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈషా రెబ్బ వరంగల్‌కు చెందిన తెలుగు నటి. 2012లో ‘లైఫ్ ఈజ్ బ్యూటిఫుల్’ చిత్రం ద్వారా చిత్ర రంగ ప్రవేశం చేశారు. ‘అంతకుముందు ఆ తర్వాత’ చిత్రంలో హీరోయిన్‌గా నటించారు. ఇటీవల ‘ఓం శాంతి శాంతి’ చిత్రంలో నటించారు. ఇటీవలి కాలంలో సినిమా తారలపై సోషల్ మీడియాలో కొంతమంది అభ్యంతరకర పోస్టులు, కామెంట్లు పెట్టడం బాగా పెరిగింది. సోషల్ మీడియాలో పవన్ కల్యాణ్, జూనియర్ ఎన్టీఆర్ వంటి ప్రముఖ హీరోల ఫొటోలు, వీడియోలను అనుమతి లేకుండా కంటెంట్‌ను దుర్వినియోగం చేసిన సందర్భాలు ఉన్నాయి. వీటికి సంబంధించి వారు కోర్టులను కూడా ఆశ్రయించారు.

జై భీమ్
తెలుగు దినపత్రిక
POWER OF PEOPLE
Jai Bheem

## డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పదకొండోసారి పట్టుబడ్డ వాహనదారుడికి 30 రోజుల జైలు శిక్ష

**వరంగల్, 4 ఫిబ్రవరి 2026 (జై భీమ్ క్రైమ్ న్యూస్)**

వరంగల్ నగరంలో మద్యం సేవించి వాహనం నడిపే వారిపై పోలీసులు కఠిన చర్యలు చేపడుతున్నారు. వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ ఆదేశాల మేరకు కాజీపేట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో ఒక పునరావృత నేరస్తుడు మరోసారి పట్టుబడ్డాడు. పాలకుర్తి మండలం బొమ్మెర గ్రామానికి చెందిన శివరాత్రి దేవయ్య గత రాత్రి మద్యం సేవించి వాహనం నడుపుతూ పోలీసుల తనిఖీల్లో చిక్కాడు. బ్రీత్ అనలైజర్ పరీక్షలో అతడు మద్యం సేవించినట్టు నిర్ధారణ కావడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. ఇదే వ్యక్తి ఇప్పటికే పది సార్లు డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో పట్టుబడినప్పటికీ మార్పు లేకుండా పదకొండోసారి కూడా అదే నేరానికి పాల్పడటం పోలీసులను ఆందోళనకు గురిచేసింది. ఈ నేపథ్యంలో ట్రాఫిక్ పోలీసులు దేవయ్యను బుధవారం సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరు పరిచారు. కేసును విచారించిన న్యాయమూర్తి ఎస్. ఫాతిమా చిన్నప్ప పునరావృతంగా నేరానికి పాల్పడినట్లు పరిగణనలోకి తీసుకుని, అతడికి 30 రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించారు. ఈ వివరాలను కాజీపేట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వెంకన్న వెల్లడిస్తూ, డ్రంక్ అండ్ డ్రైవ్ వల్ల రోడ్డు మీద ఉన్న నిరపరాధుల ప్రాణాలు ప్రమాదంలో పడతాయని, ఇకపై ఇటువంటి పునరావృత నేరాలపై మరింత కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. మద్యం సేవించి వాహనం నడపడం వల్ల జరిగే ప్రమాదాలు కుటుంబాలను శాశ్వత విషాదంలోకి నెట్టేస్తాయని, చట్టాన్ని లెక్కచేయకుండా ప్రాణాలతో చెలగాటమాడే వారిపై జైలు శిక్షలు తప్పవని ఈ ఘటన మరోసారి రుజువు చేసింది. పోలీసులు ప్రజలను అప్రమత్తం చేస్తూ --- మద్యం సేవించిన తర్వాత వాహనం నడపకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచిస్తున్నారు.

## కూడా చైర్మన్ వెంకట్రాంరెడ్డి వివాహ వార్షికోత్సవ సందర్భంగా శ్రీ భద్రకాళీ అమ్మవారి దర్శనం





**వరంగల్, 04 ఫిబ్రవరి 2026(జై భీమ్ న్యూస్)**

వరంగల్ మహానగరంలో చరిత్ర ప్రసిద్ధిగాంచిన శ్రీ భద్రకాళీ దేవస్థానంను బుధవారం ఉదయం కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ (కుడా) చైర్మన్ ఇనుగాల వెంకట్రాంరెడ్డి తమ సతీమణితో కలిసి, తమ వివాహ వార్షికోత్సవం సందర్భంగా దర్శించుకొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి విచ్చేసిన కుడా చైర్మన్ దంపతులకు ఆలయ అధికారులు, అర్చకులు ఘన స్వాగతం పలికారు. ముందుగా ఆదిశంకరాచార్యులు, వల్లభ గణపతి దర్శనాలు చేసుకున్న అనంతరం అమ్మవారి గర్భగుడిలోకి ప్రవేశించి శ్రద్ధాభక్తులతో ప్రత్యేక పూజలు చేశారు. పూజానంతరం ఆలయ మహా మండపంలో శ్రీ భద్రకాళి శేషు ఆధ్వర్యంలో అర్చకులు, వేద పండితులు మహదాశీర్వచనం నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి శేషవస్త్రాలు, ప్రసాదాలు దంపతులకు భక్తిశ్రద్ధలతో అందజేశారు. ఈ పుణ్య సందర్భంలో ఆలయ ప్రాంగణం భక్తులతో కళకళలాడుతూ ఆధ్యాత్మిక వాతావరణంతో మార్మోగింది.

## మంచిర్యాలలో ఖాకీకి మచ్చ.. కానిస్టేబుల్ సస్పెండ్

**మంచిర్యాల, 4 ఫిబ్రవరి 2026(జై భీమ్ న్యూస్)**

మంచిర్యాల జిల్లాలో జరిగిన ఓ దారుణ ఘటన పోలీస్ విభాగానికే మచ్చగా మారింది. రెడ్డి కాలనీలో నివాసం ఉంటున్న పోలీస్ కానిస్టేబుల్ రవి ప్రసాద్ తన భార్యపై అమానుషంగా దాడి చేయడం రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారింది. కులాంతర వివాహం చేసుకున్న ఈ దంపతులకు ఒక చిన్న బాబు కూడా ఉండగా, కుటుంబ కలహాలు చివరకు రోడ్డుపై హింసగా మారాయి. ఈ నెల 1వ తేదీ అర్ధరాత్రి భర్త--భార్యల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ గొడవలో రవి ప్రసాద్ తన భార్యను అర్ధనగ్నంగా నడిరోడ్డుపైకి లాగి, విచక్షణారహితంగా కొట్టి, అవమానించినట్లు వీడియోల్లో స్పష్టంగా కనిపించింది. చుట్టూ ఉన్న ప్రజలు చూస్తుండగానే జరిగిన ఈ దాడి వీడియోలు కొద్దిసేపటిలోనే సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ప్రజల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమైంది. “చట్టాన్ని కాపాడాల్సిన ఖాకీ చేతిలోనే మహిళ భద్రత ప్రమాదంలో పడటం సిగ్గుచేటు” అంటూ నెటిజన్లు మండిపడ్డారు. ఈ ఘటనపై బాధిత మహిళ పోలీసులకు అధికారికంగా ఫిర్యాదు చేయగా, జిల్లా పోలీస్ అధికారులు వెంటనే విచారణ ప్రారంభించారు. ప్రాథమిక దర్యాప్తులో ఆరోపణలు నిజమని తేలడంతో, కానిస్టేబుల్ రవి ప్రసాద్‌ను విధుల నుంచి తక్షణమే సస్పెండ్ చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే మహిళపై హింసకు సంబంధించిన కేసు నమోదు చేసి, చట్టపరమైన చర్యలు కొనసాగుతున్నట్లు పోలీసులు వెల్లడించారు. మహిళా హక్కుల సంఘాలు, పౌర సంఘాలు ఈ ఘటనపై తీవ్రంగా స్పందించాయి. “చట్టాన్ని అమలు చేయాల్సిన వ్యక్తే చట్టాన్ని కాలరాస్తే, అతనిపై మరింత కఠిన చర్యలు తీసుకోవాలి” అని వారు డిమాండ్ చేస్తున్నారు. బాధిత మహిళకు పూర్తి న్యాయం అందించాలని, ఆమెకు మరియు చిన్నారికి రక్షణ, సహాయం కల్పించాలని కోరుతున్నారు. ఈ ఘటనతో మంచిర్యాల జిల్లాలోనే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా పోలీస్ వ్యవస్థపై చర్చ మొదలైంది. మహిళల భద్రత విషయంలో ఎవరికి మినహాయింపు ఉండదని, ఖాకీ ధరించినా నేరానికి పాల్పడితే చట్టం తన పని చేస్తుందని అధికారులు స్పష్టం చేశారు.

# అక్కంపేటలో ఆర్ వీఆర్ గ్రూపు అధినేత





**అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు**

**భగవంతుని విశ్వసించడంలో బలమైన ధర్మాన్ని అనుసరించాలి**

**ఎంత స్థాయికి ఎదిగిన విశ్వాసాన్ని వదులుకోకూడదు**

**సమాజ హితవు కోరే ఆదర్శవంతంగా మనకు మనమే సిద్ధపడాలి**

**ధర్మాన్ని మనం కాపాడుకుంటే ధర్మం మనల్ని రక్షిస్తుంది**

**వరంగల్ (జై భీమ్ న్యూస్)**

సిద్ధాంతపరమైన విలువలకు ప్రాధాన్యత నిచ్చే ప్రముఖులలో రాయపాటి వెంకటేశ్వర్ రావు ముఖ్యలని డాక్టర్ బరిగెల శివ కొనియాడారు.యువతకేకాకుండా అన్ని వర్గాల ప్రజలకు ఆదర్శంగా నిలుస్తున్న తన జీవిత ప్రయాణాన్ని ఎందరో ఆదర్శంగా తీసుకుంటున్నారని అభినందించారు.సమాజ శ్రేయస్సు కొరకు తను నమ్మిన సిద్ధాంతాల కొరకు ధర్మాన్ని రక్షిస్తూ సమాజాన్ని కాపాడుతూ ముందుకు సాగడంలో ప్రాధాన్యతను ఇస్తుండడమే కాకుండా వేల సంఖ్యలో తన అనుచర గలాన్ని తయారు చేస్తుండడం ఎంతో ప్రాధాన్యతకు తాగిస్తుందన్నారు.ఒక వ్యక్తిశక్తిగాఎదుగుతున్న సందర్భాల్లో రాజకీయాలతో సంబంధం లేకుండా ఎంతటి ప్రభావాన్ని చూపగలరో రాయపాటి వెంకటేశ్వర్ రావు దానికి చక్కని నిదర్శనంగా చెప్పుకోగలమన్నారు.బుధవారం అక్కంపేటలోని పలు దేవాలయాలను సందర్శించిన వెంకటేశ్వర్ రావు అభివృద్ధి పనులను పరిశీలిస్తూ అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని ఆదేశించిన తీరు ఆయా ప్రాంతాల ప్రజలను ఎంతగానో ఆకర్షించిందన్నారు.తన కార్యక్రమాల్లోని వివిధ పనులను పరిశీలించగా రావిపాటి వెంకటేశ్వర్ రావు పర్యటన నేడు రావిపాటి వెంకటేశ్వర్ రావు అక్కంపేట గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా శ్రీ కోదండ రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించి,పనుల పురోగతిపై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఆయన ఆంజనేయస్వామి ఆలయం, పోచమ్మ దేవాలయం, బొడ్రాయి,అగ్రహం పహాడ్ జాతరలను సందర్శించారు. అలాగే గ్రామ పరిపాలనా కేంద్రంగా ఉన్న అక్కంపేట గ్రామ సచివాలయంను కూడా పరిశీలించారు. ఈ పర్యటన సందర్భంగా గ్రామ సర్పంచ్,ఆలయ ధర్మకర్తలు, గ్రామ పెద్దలు స్థానికులు ఆయనకు ఘన స్వాగతం పలికి, సంప్రదాయబద్ధంగా సన్మానం చేశారు గ్రామాభివృద్ధికి ఎప్పటికప్పుడు సహకరిస్తున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు.

## భీమారం ఆయుష్మాన్ ఆరోగ్య మందిరంలో డీఎంహెచ్‌ఓ ఆకస్మిక తనిఖీ

**గర్భిణీ స్త్రీల మాతా శిశు సంక్షేమంపై పూర్తి స్థాయి అవగాహన కల్పించాలి : డాక్టర్ ఎ. అప్పయ్య**






**హన్మకొండ, ఫిబ్రవరి 4, 2026 (జై భీమ్ న్యూస్)**

గర్భిణీ స్త్రీలు, నవజాత శిశువుల ఆరోగ్యం రాష్ట్రానికి అత్యంత ప్రాధాన్య అంశమని జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎ. అప్పయ్య స్పష్టం చేశారు. భీమారం ప్రాంతంలోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిరం కేంద్రాన్ని బుధవారం ఆకస్మికంగా సందర్శించిన ఆయన, అక్కడ కొనసాగుతున్న వ్యాక్సినేషన్ కార్యక్రమాలు, గర్భిణీ స్త్రీల నమోదు విధానం, సేవల నాణ్యతను సమగ్రంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన డ్యూ లిస్ట్‌ను పరిశీలించి, టీకాలు తీసుకోవాల్సిన లబ్ధిదారులందరికీ ముందస్తుగా సమాచారం అందిందా లేదా, ఎంతమంది హాజరయ్యారు, మిగిలిన వారు ఎందుకు రాలేదన్న అంశాలపై సిబ్బందిని ప్రశ్నించారు. టీకాల శాతం 100 శాతం సాధించేందుకు ఇంటింటి సందర్శనలు చేసి లబ్ధిదారులను ప్రోత్సహించాలని సూచించారు. డాక్టర్ అప్పయ్య మాట్లాడుతూ, టీబీ వల్నరబుల్ పాప్యులేషన్ స్క్రీనింగ్‌ను త్వరితగతిన పూర్తిచేయాలని ఆదేశించారు. అలాగే ప్రతి గర్భిణీ స్త్రీని మొదటి త్రైమాసికంలోనే నమోదు చేసి, వారి ఆరోగ్యాన్ని నిరంతరం పర్యవేక్షించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రసవాలు తప్పనిసరిగా ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే జరిగేలా ప్రోత్సహించాలని, ముఖ్యంగా సాధారణ (నార్మల్) ప్రసవాలు పెరిగే విధంగా వైద్య సిబ్బంది, ఆశా, ఏఎన్ఎంలు కలిసి పనిచేయాలని సూచించారు. గర్భిణీ స్త్రీలకు నమ్మకం కలిగించే సేవలు, వ్యక్తిగత కౌన్సిలింగ్ ఎంతో అవసరమని పేర్కొంటూ, ఆహారం, విశ్రాంతి, టీకాలు, పరీక్షలు, ఆసుపత్రి ప్రసవాల ప్రాధాన్యత వంటి అంశాలపై వారిని సైతం వివరంగా అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఇటీవల జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గర్భిణీ స్త్రీలకు వారు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, లింగ నిర్ధారణ చట్టవిరుద్ధమని, అమ్మాయి అయినా అబ్బాయి అయినా సమానమేనని, అలాగే ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలు చేయాలని ఎస్ఎంఎస్ ద్వారా పంపించిన సమాచారంపై వారి స్పందన ఏ విధంగా ఉందో కూడా తెలుసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ తనిఖీ కార్యక్రమంలో ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు. గర్భిణీ స్త్రీలకు అందే ప్రతి సేవ సకాలంలో, నాణ్యంగా, మానవీయంగా అందేలా క్షేత్రస్థాయి సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలని డాక్టర్ అప్పయ్య స్పష్టం చేశారు.

## తెలుగు రాష్ట్రాల్లో భారీగా ఎయిడ్స్ మరణాలు.. ఐటీ రంగంలో విస్తరిస్తున్న హెచ్ఐవీ

**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

ఏపీ, తెలంగాణల్లో ఎయిడ్స్ మరణాలు ఆందోళనకర స్థాయిలో ఉన్నాయి. గత ఐదేళ్లలో హెచ్ఐవీ బారిన పడి మరణించిన వారి సంఖ్య ఆందోళన కలిగిస్తోంది. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన గణాంకాల ప్రకారం... 2020-2024 మధ్య కాలంలో దేశ వ్యాప్తంగా 1.81 లక్షల మంది హెచ్ఐవీ కారణంగా చనిపోయారు. వీరిలో తెలుగు రాష్ట్రాల్లో మరణించిన వారి సంఖ్య 44,140గా ఉంది. ఏపీలో 32,642 మంది చనిపోగా... తెలంగాణలో 11,498 మంది మృతి చెందారు. మరో షాకింగ్ విషయం ఏమిటంటే... ఐటీ రంగంలో హెచ్ఐవీ వైరస్ విస్తృతంగా వ్యాపిస్తోంది. ఈ విషయాన్ని జాతీయ ఎయిడ్స్ నియంత్రణ వ్యవస్థ వెల్లడించింది. విదేశీ తరహా జీవనశైలికి అలవాటు పడటం ఐటీ రంగంలో హెఐవీ వ్యాప్తి కావడానికి కారణమవుతోందని తెలిపింది. ఈ రంగంలో హెచ్ఐవీ పరీక్షల సంఖ్యలను పెంచాల్సి ఉందని సూచించింది.

## గీత కార్మికుడికి తీవ్ర గాయాలు

**బట్టుపల్లి గ్రామంలో విధి నిర్వహణలో విషాద ప్రమాదం**

**హన్మకొండ, 4 ఫిబ్రవరి 2026 (జై భీమ్ న్యూస్)**



హనుమకొండ మండలంలోని బట్టుపల్లి గ్రామంలో గీత వృత్తిపై ఆధారపడి జీవనం సాగిస్తున్న ఓ కార్మికుడికి విధి నిర్వహణలో తీవ్ర ప్రమాదం చోటుచేసుకుని గ్రామాన్ని విషాదంలో ముంచింది. గ్రామానికి చెందిన పూజారి రవి తెల్లవారుజామున రోజువారీగా చేసే కల్లుగీత పనుల కోసం తాటి చెట్టెక్కిన సమయంలో ప్రమాదవశాత్తు జారి కింద పడిపోయాడు. అనూహ్యంగా జరిగిన ఈ ప్రమాదంలో రవికి కాళ్లు, తొడలు, చేతులు సహా పలు కీలక భాగాలకు తీవ్ర గాయాలు అయ్యాయి. అతని అరుపులు విన్న సమీపంలోని గ్రామస్తులు పరుగున అక్కడికి చేరుకుని, తక్షణమే కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. తీవ్ర రక్తస్రావంతో విలవిలలాడుతున్న రవిని గ్రామస్తుల సహకారంతో హుటాహుటిన హనుమకొండలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో వైద్యులు రవికి అత్యవసర చికిత్సలు అందిస్తున్నారని, ఆయన పరిస్థితి ఇంకా ఆందోళనకరంగానే ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ప్రమాద వార్త తెలిసిన వెంటనే గ్రామానికి చెందిన పలువురు ఆస్పత్రికి చేరుకుని రవి కుటుంబానికి ధైర్యం చెబుతూ సహాయాన్ని అందిస్తున్నారు. కష్టపడి కుటుంబాన్ని పోషించే రవికి ఇలా ప్రమాదం జరగడంతో భార్య, పిల్లలు భయాందోళనకు గురవుతున్నారు. గ్రామస్తులు ఈ సందర్భంగా మాట్లాడుతూ, గీత వృత్తిలో ఉన్న కార్మికులు రోజూ ప్రాణాలను పణంగా పెట్టి ఎత్తైన తాటి, ఈత చెట్లెక్కాల్సిన పరిస్థితి ఉందని, అయినప్పటికీ వారికి సరైన భద్రతా పరికరాలు, శిక్షణ, బీమా సదుపాయాలు లేకుండా పని చేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం గీత కార్మికుల భద్రతకు ప్రాధాన్యం ఇచ్చి, రక్షణ పరికరాలు, ప్రమాద బీమా, తక్షణ వైద్య సహాయం వంటి సౌకర్యాలు కల్పించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ఈ ఘటన బట్టుపల్లి గ్రామాన్ని దిగ్భ్రాంతికి గురి చేయడంతో పాటు, గీత కార్మికుల జీవితాలు ఎంతటి ప్రమాదాల మధ్య నడుస్తున్నాయో మరోసారి కళ్లముందు నిలబెట్టింది.

## శాయంపేట తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేసిన జిల్లా అదనపు కలెక్టర్ రవి

**శాయంపేట, 04 ఫిబ్రవరి 2026(జై భీమ్ న్యూస్)**




హనుమకొండ జిల్లా శాయంపేట తహసీల్దార్ కార్యాలయాన్ని జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయంలో జరుగుతున్న వివిధ పరిపాలనా కార్యకలాపాలు, ప్రజలకు అందిస్తున్న సేవల పనితీరును ఆయన సమగ్రంగా పరిశీలించారు. ఈ సందర్భంగా భూభారతి, సాదా బైనామా, జాతీయ రహదారులకు సంబంధించిన భూ రికార్డులు, మీ సేవా సర్టిఫికెట్లు, కళ్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ వంటి కీలక పథకాల ఫైళ్లను అదనపు కలెక్టర్ పరిశీలించారు. ప్రజలకు అందించాల్సిన సర్టిఫికెట్లు జాప్యం లేకుండా, వేగవంతంగా జారీ చేయాలని తహసీల్దార్ ప్రవీణ్ కుమార్ కు స్పష్టంగా ఆదేశించారు. మండలానికి సంబంధించి ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రెవిషన్ --ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా చేపడుతున్న మ్యాపింగ్ పనుల పురోగతిపై కూడా అదనపు కలెక్టర్ ఆరా తీశారు. ఎన్నికల పారదర్శకతకు ఇది కీలకమైన అంశమని పేర్కొంటూ, ఎలాంటి పొరపాట్లు లేకుండా పూర్తి చేయాలని సూచించారు. భూభారతి, సాదా బైనామా, రెవెన్యూ అంశాలపై అధికారులకు పలు సూచనలు చేస్తూ, ప్రజలకు భూ సంబంధిత సేవలు సులభంగా అందేలా వ్యవస్థను మరింత సమర్థంగా అమలు చేయాలని ఆదేశించారు. ఈ తనిఖీ కార్యక్రమంలో పరకాల ఆర్డీఓ డా. కన్నం నారాయణ, ఎంపీడీవో ఫణి చంద్ర, తదితర అధికారులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు వేగంగా, పారదర్శకంగా అందేలా ఇటువంటి ఆకస్మిక తనిఖీలు కొనసాగుతాయని అధికారులు తెలిపారు.

# హసన్‌పర్తి మండలంలో అభివృద్ధి ఘట్టం





### గ్రామపంచాయతీ, అంగన్వాడి నూతన భవనాలకు శంకుస్థాపన

**హసన్‌పర్తి, ఫిబ్రవరి 4 (జై భీమ్ న్యూస్)**

వర్ధన్నపేట నియోజకవర్గంలో సమగ్ర గ్రామాభివృద్ధికి బాటలు వేసిన కె.ఆర్. నాగరాజు ఆదేశాల మేరకు హసన్‌పర్తి మండల కేంద్ర పరిధిలోని మల్లారెడ్డి పల్లి, అర్వపల్లి గ్రామాల్లో ప్రజలకు కీలకమైన మౌలిక వసతుల కల్పన దిశగా మరో అడుగు ముందుకు పడింది. ఈ క్రమంలో మల్లారెడ్డి పల్లి గ్రామంలో నూతన గ్రామపంచాయతీ భవనంకు శంకుస్థాపన జరగగా, అర్వపల్లి గ్రామంలో నూతన అంగన్వాడి కేంద్రంను ఘనంగా ప్రారంభించారు. మల్లారెడ్డి పల్లిలో గ్రామ సర్పంచి గాజు కృష్ణవేణి -- యుగేందర్ యాదవ్ ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ నూతన భవనానికి శంకుస్థాపన చేశారు. అదే విధంగా అర్వపల్లి గ్రామంలో సర్పంచ్ ధ్రిడి సాంబయ్య అంగన్వాడి నూతన భవనాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమాలు గ్రామాల పరిపాలనా సామర్థ్యాన్ని, శిశు-మాతృ సంక్షేమ సేవలను మరింత బలోపేతం చేసే దిశగా కీలకమైనవిగా నిలిచాయి. ఈ అభివృద్ధి కార్యక్రమాలకు హసన్‌పర్తి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పొరెడ్డి మహేందర్ రెడ్డి బ్లాక్, ఆత్మకూరు వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ తంగేళ్లపల్లి తిరుపతి ముఖ్యఅతిథులుగా హాజరై ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. "గ్రామీణ మౌలిక సదుపాయాల అభివృద్ధే నిజమైన సంక్షేమం. ప్రతి గ్రామంలో పాలన సులభతరం కావాలంటే పంచాయతీ భవనాలు, బాల్య సంరక్షణకు అంగన్వాడీలు బలోపేతం కావాలి" అని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మల్లారెడ్డి పల్లి గ్రామ పార్టీ అధ్యక్షులు గట్ట సాంబయ్య, నాయకులు రాకేష్, కొత్తపెల్లి మాజీ సర్పంచ్ రామరాజ్, కొమురయ్య, గౌడ రాజ్, పిట్ట భవాని తదితర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు. అధికార యంత్రాంగం తరఫున ఎంపీవో కర్ణాకర్ రెడ్డి, ఎఈ వెంకటేశ్వర్లు హాజరై నిర్మాణ పనులు వేగంగా, నాణ్యతతో పూర్తి చేయాలని సూచించారు. సర్పంచులు, వార్డ్ మెంబర్లు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమానికి ఘనత చేకూర్చారు. నూతన గ్రామపంచాయతీ భవనం ప్రారంభంతో గ్రామ పరిపాలన మరింత పారదర్శకంగా, సులభంగా సాగనుంది. అలాగే అంగన్వాడి కేంద్రం ద్వారా గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు పోషకాహారం, ఆరోగ్య సంరక్షణ సేవలు మరింత సమర్థంగా అందనున్నాయి. ఈ రెండు ప్రాజెక్టులు గ్రామీణ జీవన ప్రమాణాలను మెరుగుపరిచే కీలక మైలురాళ్లుగా నిలవనున్నాయని నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు.

# కాకతీయ యూనివర్సిటీలో.. సైక్లింగ్ సెలక్షన్స్ విజయవంతం





### అఖిల భారత స్థాయి పోటీలకు క్రీడాకారుల ఎంపిక

**హన్మకొండ, ఫిబ్రవరి 4, 2026 (జై భీమ్ న్యూస్)**

కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఆదిలాబాద్, ఖమ్మం, వరంగల్ జిల్లాలకు చెందిన వివిధ కళాశాలల విద్యార్థుల కోసం నిర్వహించిన సైక్లింగ్ రోడ్ రేస్ సెలక్షన్స్ బుధవారం ఉదయం ఘనంగా, ఉత్సాహభరితంగా పూర్తయ్యాయి. ఈ సెలక్షన్స్‌ను ఉదయం 6.00 గంటలకు విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వి. రాంచంద్రమ్ ప్రారంభించగా, ఉదయం 6.10 గంటలకు పచ్చజెండా ఊపి రేసును అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్గనైజింగ్ సెక్రటరీ డా. ఎస్. కుమార్ మాట్లాడుతూ, యూనివర్సిటీ పరిధిలోని వివిధ కళాశాలల నుంచి పెద్ద సంఖ్యలో క్రీడాకారులు పాల్గొని పోటీలను అత్యంత క్రీడాస్ఫూర్తితో సాగించారని తెలిపారు. హోరాహోరీగా సాగిన ఈ రోడ్ రేస్‌లో యువ సైక్లిస్టులు తమ శారీరక దృఢత్వం, వేగం, సమన్వయాన్ని ప్రదర్శించి అందరినీ ఆకట్టుకున్నారు. స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ ప్రొఫెసర్ వై. వెంకయ్య (కేయూ) మాట్లాడుతూ, ఈ సెలక్షన్స్‌లో విజయం సాధించిన క్రీడాకారులను మహారాష్ట్రలోని ఎంజీఎం యూనివర్సిటీలో జరగబోయే అఖిల భారత అంతర్ విశ్వవిద్యాలయ సైక్లింగ్ రోడ్ రేస్‌కు పంపించనున్నట్లు వెల్లడించారు. ఈ జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనడం ద్వారా విద్యార్థులకు తమ ప్రతిభను దేశవ్యాప్తంగా ప్రదర్శించే అవకాశం లభిస్తుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సోమన్న ఫిజికల్ ఎడ్యుకేషన్ అసోసియేషన్ (కేయూ) అధ్యక్షుడు సోమన్న, ఉపాధ్యక్షుడు రమేష్, ట్రెజరర్ ఎస్. కిరణ్ గౌడ్, వాగ్దేవి కళాశాల పిడిఎస్ కిషన్, ఆంజనేయులు, మట్టెడా కుమారస్వామి, సుమన్, పీడీ యూసీపీఈ ప్రతినిధులు పాల్గొని క్రీడాకారులను ఉత్సాహపరిచారు. కాకతీయ యూనివర్సిటీ క్రీడా విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సెలక్షన్స్ విజయవంతం కావడంతో, విశ్వవిద్యాలయం నుంచి జాతీయ స్థాయి సైక్లింగ్ పోటీలకు ప్రతిభావంతులైన క్రీడాకారులు ఎంపిక కావడం పట్ల క్రీడా వర్గాల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

# పింగిళి ప్రభుత్వ మహిళా డిగ్రీ పీజీ కళాశాలలో ఎన్‌సీసీ క్యాడెట్లకు సెరిమోనియల్ కిట్ల అందజేత







**హన్మకొండ, 4 ఫిబ్రవరి 2026(జై భీమ్ న్యూస్)**

వడ్డేపల్లిలోని పింగిళి ప్రభుత్వ మహిళా డిగ్రీ పీజీ కళాశాలలో ఎన్‌సీసీ క్యాడెట్లకు ప్రోత్సాహకరంగా రూ.15,000/- విలువ గల 25 సెరిమోనియల్ కిట్లను కళాశాల జువాలజీ విభాగాధిపతి, వైస్‌ప్రిన్సిపాల్ డా. జి. సుహాసిని అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ లెఫ్టినెంట్ ప్రొఫెసర్ బి. చంద్రమౌళి ముఖ్య అతిథిగా హాజరై, ఈ విలువైన సహకారం అందించిన డా. సుహాసినికి అభినందనలు తెలిపారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ, ఎన్‌సీసీ శిక్షణతో పాటు చదువులోనూ, ఇతర రంగాల్లోనూ క్యాడెట్లు ఉత్తమ ప్రతిభ చూపి కళాశాలకు మంచి పేరు తీసుకురావాలి అని ఆకాంక్షించారు. క్రమశిక్షణ, నాయకత్వం, దేశభక్తి వంటి విలువలు ఎన్‌సీసీ ద్వారా పెంపొందుతాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా డా. జి. సుహాసిని మాట్లాడుతూ, కళాశాల ఎన్‌సీసీ క్యాడెట్లలో ముగ్గురు 2026 జనవరి 26న ఢిల్లీలో జరిగిన రిపబ్లిక్ డే పరేడ్‌లో పాల్గొనడం కళాశాలకి గర్వకారణం అని తెలిపారు. ప్రతి సంవత్సరం ఇలాగే ఎక్కువ మంది క్యాడెట్లు ఢిల్లీ పరేడ్‌కు ఎంపికై కళాశాలకు ఖ్యాతి తీసుకురావాలని ఆకాంక్షిస్తూ, ఆ లక్ష్యానికి దోహదపడేలా సెరిమోనియల్ కిట్లను అందించామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఎన్‌సీసీ ఇన్‌చార్జి ఆఫీసర్ డా. బి. సువర్ణ, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, అలాగే ఎన్‌సీసీ క్యాడెట్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డా. జి. సుహాసినికి కళాశాల అధ్యాపకులు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

## ఉద్యోగాల భర్తీ, నిరుద్యోగ నిర్మూలనలో ప్రభుత్వాలు విఫలం : వనం సుధాకర్



**వరంగల్, 4 ఫిబ్రవరి 2026(జై భీమ్ న్యూస్)**

వరంగల్ జిల్లా గిర్నీబాయి ప్రాంతంలో నిర్వహించిన ఏఐఎఫ్‌డివై రాష్ట్ర కమిటీ సమావేశంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఏఐఎఫ్‌డివై రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వనం సుధాకర్ తీవ్ర విమర్శలు చేశారు. దేశంలో ఉద్యోగాల భర్తీ, నిరుద్యోగ నిర్మూలన విషయంలో ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని ఆయన ఆరోపించారు. దేశంలో ప్రతి ఏడాది కోటి ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం ఇప్పటికి 13 సంవత్సరాలు గడిచినా ఆ హామీలను నెరవేర్చలేకపోయిందని విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేసి, ప్రైవేటు కార్పొరేట్ సంస్థలకు అప్పగించడం ద్వారా ఉద్యోగ, ఉపాధి అవకాశాలను దెబ్బతీస్తున్నదని అన్నారు. బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న ఆర్థిక విధానాల వల్ల దేశ యువతకు భవిష్యత్ లేకుండా పోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణలో గత టీఆర్ఎస్ ప్రభుత్వం 'ఇంటికో ఉద్యోగం' అనే నినాదంతో పదేళ్లు పాలించినా నిరుద్యోగ సమస్యను పరిష్కరించలేదని, ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం కూడా 'జాబు క్యాలెండర్' అమలు చేస్తామని ప్రకటించినప్పటికీ వాస్తవంగా ఉద్యోగాల భర్తీ, నిరుద్యోగ భృతి విషయంలో ఎలాంటి స్పష్టమైన చర్యలు చేపట్టలేదని వనం సుధాకర్ విమర్శించారు. వార్షిక బడ్జెట్లలో కూడా ఉద్యోగ, ఉపాధి రంగాలకు తగిన నిధులు కేటాయించడంలో ప్రభుత్వం విఫలమైందని తెలిపారు. ఈ పరిస్థితుల్లో రాష్ట్రంలోని నిరుద్యోగ యువత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తప్పుడు విధానాలను ప్రజల్లో ఎండగట్టి ప్రశ్నించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మార్చి 7, 2026న హైదరాబాద్‌లోని ఓంకార్ భవన్‌లో ఏఐఎఫ్‌డివై రాష్ట్ర ప్లీనం నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. రాష్ట్రంలో ఉద్యోగాలు, ఉపాధి, నిరుద్యోగ భృతి వంటి కీలక అంశాలపై భవిష్యత్ కార్యాచరణను ఈ ప్లీనంలో రూపొందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి రాష్ట్రవ్యాప్తంగా యువత, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశం ఏఐఎఫ్‌డివై రాష్ట్ర అధ్యక్షులు కామ్రేడ్ కర్ర హాసిరెడ్డి అధ్యక్షతన జరిగింది. సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు మంద రవి, సహాయ కార్యదర్శి నీల రవీందర్, కోశాధికారి డి. మధుసూదన్, కమిటీ సభ్యులు వీరమల్లు కిరణ్, జక్క అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## వరంగల్ కలెక్టరేట్‌లో ఘనంగా తెలంగాణ సామాజిక న్యాయ దినోత్సవం







**వరంగల్, 4 ఫిబ్రవరి 2026(జై భీమ్ న్యూస్)**

రాష్ట్ర సామాజిక న్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం వరంగల్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా స్థాయి అధికారులు, ప్రభుత్వ ఉద్యోగులతో సామాజిక న్యాయ ప్రతిజ్ఞ చేయించి సమానత్వం, సమాన అవకాశాల ప్రాధాన్యాన్ని గుర్తు చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ, ఫిబ్రవరి 4, 2025న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సామాజిక న్యాయ దినోత్సవాన్ని అధికారికంగా ప్రకటించిందని తెలిపారు. సమాజంలోని ప్రతి వర్గానికి---ముఖ్యంగా దివ్యాంగులు, నిరుపేదలు, వృద్ధులు---సమాన అవకాశాలు, న్యాయం, సేవలు అందించడమే ఈ దినోత్సవం యొక్క ముఖ్య లక్ష్యమని పేర్కొన్నారు. సామాజిక న్యాయం వ్యక్తి జీవితంలో విద్యార్థి దశ నుంచే అలవాటుగా మారాలి అనే ఉద్దేశంతో ఈ రోజున పాఠశాలలు, కళాశాలల్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సామాజిక న్యాయానికి భంగం కలగకుండా ఉండేందుకే వివిధ కమిషన్లు ఏర్పాటు చేయబడినట్లు గుర్తుచేశారు. ఇటీవలి కాలంలో తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేసే ఘటనలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేసిన కలెక్టర్, ఇవి కేవలం చట్టాలతోనే కాకుండా సమాజంలో విలువల మార్పు వచ్చినప్పుడే తగ్గుతాయని అన్నారు. చిన్ననాటి నుంచే పెద్దలను గౌరవించే సంస్కారం, సామాజిక భద్రతపై అవగాహన విద్యా సంస్థల నుంచే కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, జెడ్పి సీఈవో రామ్ రెడ్డి, డీఆర్ఓ విజయలక్ష్మి, డిబిసిడిఓ పుష్పలత, ఆర్డీవో సుమతో పాటు జిల్లా అధికారులు, వివిధ శాఖల ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొని సామాజిక న్యాయ ప్రతిజ్ఞలో భాగస్వాములయ్యారు.

## ప్రభుత్వాలు శాశ్వతం కాదు..

### రాజ్యసభలో కమల్ హాసన్ తొలి ప్రసంగం

**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

ప్రముఖ నటుడు, మక్కల్ నీది మయ్యం (వీచీవీ) అధినేత కమల్ హాసన్ రాజ్యసభలో తన తొలి ప్రసంగంతో ఆకట్టుకున్నారు. బుధవారం నాడు బడ్జెట్ సమావేశాల్లో భాగంగా రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై జరిగిన చర్చలో ఆయన పాల్గొన్నారు. ఏ ప్రభుత్వమూ శాశ్వతం కాదని, అధికారం ఎవరికీ శాశ్వతం కాదనే విషయాన్ని గుర్తుంచుకోవాలని ఆయన హితవు పలికారు. "వివిధ రంగాలకు చెందిన వారు తమ ప్రజల తరఫున మాట్లాడేందుకు ఈ సభలోకి ప్రవేశించడానికి అనేక ద్వారాలు తెరుచుకుంటాయి. నాకు మాత్రం సినిమా ద్వారా ఆ ద్వారం తెరుచుకుంది" అని కమల్ హాసన్ తన ప్రసంగాన్ని ప్రారంభించారు. తనకు మద్దతిచ్చిన తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. పెరియార్, సి.ఎన్. అన్నాదురై, మహాత్మా గాంధీ వంటి మహనీయుల ప్రభావం తన ఆలోచనలు, రాజకీయాలపై ఉందని పేర్కొన్నారు. కమల్ హాసన్ ప్రసంగానికి సభ్యుల నుంచి మంచి స్పందన లభించింది.

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE

# మొయినాబాద్‌లో యువ న్యాయవాదిని హత్య

**న్యాయవాద లోకాన్ని కుదిపేసిన దారుణ ఘటన**



**మొయినాబాద్, 4 ఫిబ్రవరి 2026(జై భీమ్ న్యూస్)**

రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలంలోని కేతిరెడ్డిపల్లి గ్రామంలో చోటుచేసుకున్న దారుణ హత్య ఘటన రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర కలకలం రేపుతోంది. స్వప్న (34) అనే యువ న్యాయవాదిని హత్య చేసిన ఘటన న్యాయవాద వర్గాలను తీవ్రంగా షాక్‌కు గురి చేసింది. హత్యకు గురైన స్వప్న మృతదేహం ప్రస్తుతం భాస్కర ఆసుపత్రిలో ఉన్నట్లు సమాచారం. న్యాయవాద వృత్తిలో ఉంటూ న్యాయం కోసం పోరాడే ఒక మహిళ న్యాయవాదిని ఇంత అమానుషంగా హత్య చేయడం ప్రజాస్వామ్య వ్యవస్థనే ప్రశ్నించే స్థాయిలో ఉందని న్యాయవాదులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనను తీవ్రంగా ఖండిస్తూ చేవెళ్ల కోర్టు న్యాయవాదులు విధులను బహిష్కరించి కోర్టు ప్రాంగణంలో నిరసనకు దిగారు. "న్యాయవాదికే న్యాయం లేకపోతే సామాన్య ప్రజల పరిస్థితి ఏమిటి?" అంటూ నినాదాలు చేస్తూ వారు ఆందోళన చేపట్టారు. న్యాయవాదుల భద్రతపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తూ, ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ హత్య మొయినాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిందని పోలీసులు ధృవీకరించారు. హత్యకు గల కారణాలు, నిందితుల వివరాలపై ఇంకా పూర్తి సమాచారం వెలువడాల్సి ఉందని, అయితే ప్రత్యేక బృందాలతో దర్యాప్తు వేగవంతం చేసినట్లు పోలీసులు తెలిపారు. న్యాయవాదులపై పెరుగుతున్న దాడులను దృష్టిలో ఉంచుకొని వారికి తక్షణ భద్రత కల్పించాల్సిన అవసరం ఉందని, ఈ కేసులో దోషులను కఠినంగా శిక్షించాలని న్యాయవాద సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ఈ ఘటనపై మరిన్ని వివరాలు వెలుగులోకి రావాల్సి ఉంది.

# పొలంలో గడ్డి మందు చల్లిన దుండగులపై చర్యలు తీసుకోవాలి

**బాధితుడు చల్ల రమణా రెడ్డి**



**ఎల్కతుర్తి, 4 ఫిబ్రవరి 2026 (జై భీమ్ న్యూస్)**

హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం దామెర గ్రామానికి చెందిన రైతు చల్ల రమణా రెడ్డి తన పొలంలో గుర్తు తెలియని వ్యక్తులు గడ్డి మందు (హెర్బిసైడ్) చల్లి పంటను నాశనం చేశారని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, తనకు చెందిన ఎకరా ఐదు గుంటల వ్యవసాయ భూమిలో సాగు చేసిన పంటపై మంగళవారం రాత్రి సమయంలో దుండగులు అక్రమంగా గడ్డి మందు చల్లారని తెలిపారు. ఈ ఘటనతో పంట పూర్తిగా దెబ్బతిని, తాను భారీ నష్టానికి గురయ్యానని వాపోయారు. ఈ ఘటనపై వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు రమణా రెడ్డి చెప్పారు. గ్రామంలో ఇటీవల పెద్దమనుసుల సమీక్ష సమావేశం జరిగినప్పటికీ, ఆ తర్వాత ఇలాంటి దుర్మార్గమైన చర్యలకు పాల్పడటం చట్టవిరుద్ధమని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. నిందితులను గుర్తించి తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను, గ్రామస్తులను కోరారు. పంటలపై విషపూరిత మందులు చల్లడం రైతుల జీవనాధారంపై దాడి చేయడమేనని, ఇలాంటి ఘటనలు గ్రామీణ సమాజంలో శాంతిభద్రతలకు ముప్పుగా మారుతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు ఈ కేసును సీరియస్‌గా తీసుకుని విచారణ చేపట్టాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

# అతివేగం కారణంగా అశోక్ లేలాండ్ వాహనం బోల్తా

**వెంటనే స్పందించి క్షతగాత్రులను దవాఖానకు చేర్చిన తాడ్వాయి ఎస్ ఐ జగదీశ్**



**తాడ్వాయి. జై భీమ్ న్యూస్**

చర్ల నుండి మేడారం వెళ్తున్న అశోక్ లేలాండ్ వాహనం తాడ్వాయి మండలం పరిధిలో అతివేగం కారణంగా బోల్తా పడి ప్రమాదానికి గురైంది. కామారం గ్రామాన్ని దాటి గిన్నెలవాగు బ్రిడ్జి సమీపంలోని మలుపు వద్ద వాహనం అతి వేగంగా వెళ్లడం వల్ల డ్రైవర్ నియంత్రణ కోల్పోయి వాహనం బోల్తా పడింది. ఈ ప్రమాదంలో వాహనంలో ప్రయాణిస్తున్న సుమారు 30 మంది ప్రయాణికుల్లో 10 మంది తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న వెంటనే తాడ్వాయి ఎస్.ఐ. జగదీశ్ తన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని వెంటనే సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిని అంబులెన్స్ లో సమీప దవాఖానకు తరలించి తక్షణ చికిత్స అందేలా చర్యలు తీసుకున్నారు. ప్రమాదానికి గల కారణాలపై విచారణ చేపట్టారు. ప్రయాణికులు మూల మలుపులు, వాగు బ్రిడ్జిల వద్ద వాహనాలను అతి వేగంగా నడపకుండా జాగ్రత్తలు పాటించాలని మూల మలుపుల వద్ద ఉన్న సూచికలను పాటిస్తూ వాహనాలు నడపాలని ఎస్ ఐ తెలియచేసారు.

# పరకాలలో మినీ జాబ్ మేళా - నిరుద్యోగ యువతకు 60కి పైగా ఉద్యోగావకాశాలు





**హన్మకొండ జిల్లా, పరకాల, 4 ఫిబ్రవరి 2026 (జై భీమ్ న్యూస్)**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో పరకాల మండల కేంద్రంలో మినీ జాబ్ మేళా – 2026 నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. జిల్లా ఉపాధి కల్పన కేంద్రం (ఎన్‌సీఎస్ వరంగల్), జిల్లా పరిపాలన, పరకాల మున్సిపాలిటీ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాయి. ఈ మేరకు పరకాల మండల కేంద్రంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో జాబ్ మేళా ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ కె. శివ కుమార్ నాయక్ ఐఏఎస్, ఆర్డీఓ శ్రీ కె. నారాయణ, మునిసిపల్ కమిషనర్, ఎంపిడిఓ, జిల్లా ఉపాధి శాఖ అధికారులు, టీపీఓ సునీత తదితరులు పరిశీలించారు. ఈ జాబ్ మేళాను విజయవంతం చేసి ఎక్కువ మంది యువతకు ఉద్యోగాలు అందించాలనే దిశగా అధికారులు పలు సూచనలు చేశారు. ఈ మినీ జాబ్ మేళా ఫిబ్రవరి 7, 2026 (శనివారం) ఉదయం 11 గంటలకు పరకాల మండల కేంద్రంలో నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్, హనుమకొండ, కరీంనగర్, హైదరాబాద్ తదితర ప్రాంతాలకు చెందిన ప్రముఖ ప్రైవేట్ సంస్థలు పాల్గొని ఉద్యోగ నియామకాలు చేపట్టనున్నాయి. జాబ్ మేళాలో మొత్తం 60కి పైగా ఉద్యోగ ఖాళీలు అందుబాటులో ఉన్నాయి. ఎస్ఎంఎంఎఫ్ ఎదు సొల్యూషన్స్, కన్సెప్ట్ టు కంప్లీషన్, ధ్రువత్ సొల్యూషన్స్, నిర్మాణ్ ఆర్గనైజేషన్, గ్రోయల్ ఫీడ్స్, విజయ ఫర్టిలైజర్స్ వంటి కంపెనీలు ఈ జాబ్ మేళాలో పాల్గొని కస్టమర్ సపోర్ట్, హెచ్ఆర్ ఎగ్జిక్యూటివ్‌లు, టెలికాలర్స్, అడ్వాన్స్ ఎక్సెల్, సేల్స్ ఎగ్జిక్యూటివ్ వంటి విభాగాల్లో ఉద్యోగాలను అందించనున్నాయి. ఈ ఉద్యోగాలకు 18 నుంచి 35 సంవత్సరాల వయస్సు కలిగిన అభ్యర్థులు అర్హులు కాగా, అర్హతగా ఇంటర్ లేదా ఏదైనా డిగ్రీ ఉండాలి. నెలకు రూ.10,000 నుంచి రూ.35,000 వరకు వేతనం, కొన్ని సంస్థల ద్వారా ఇన్సెంటివ్స్, ఉచిత భోజనం మరియు వసతి సౌకర్యం కూడా అందించనున్నారు. పరకాల, హనుమకొండ, వరంగల్ పరిసర ప్రాంతాల నిరుద్యోగ యువతకు ఈ జాబ్ మేళా గొప్ప అవకాశంగా మారనుంది. ఒక్క చోటే అనేక కంపెనీలు ఇంటర్వ్యూలు నిర్వహించి ఉద్యోగాలు ఇవ్వడం వల్ల యువతకు ఖర్చు మరియు సమయం రెండూ ఆదా అవుతాయని అధికారులు పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ముందుగా జిల్లా ఉపాధి కార్యాలయంలో నమోదు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 7893394393 నంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.

# జీవన విధానంలో మార్పుతోనే క్యాన్సర్ నివారణ సాధ్యం






**డా. ఏ. నిఖిల్ కుమార్**

**కేయూలో ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా అవగాహన సదస్సు, ఉచిత వైద్య శిబిరం**

**వరంగల్, ఫిబ్రవరి 4, 2026(జై భీమ్ న్యూస్)**

ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా కాకతీయ విశ్వవిద్యాలయం (కేయూ) డీన్ స్టూడెంట్ అఫైర్స్ కార్యాలయం, మైక్రోబయాలజీ విభాగం ఆధ్వర్యంలో క్యాన్సర్‌పై అవగాహన సదస్సు మరియు ఉచిత వైద్య శిబిరం ఘనంగా నిర్వహించారు. జువాలజీ విభాగం సెమినార్ హాల్‌లో జరిగిన ఈ కార్యక్రమాన్ని కేయూ రిజిస్ట్రార్ ప్రొ. వి. రామచంద్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, యువత ఆరోగ్యంగా ఉండాలంటే జీవన విధానంలో సానుకూల మార్పులు తప్పనిసరి అని పేర్కొన్నారు. సమతుల్య ఆహారం, నిత్య వ్యాయామం, మానసిక ప్రశాంతత వంటి అంశాలు ఆరోగ్యకరమైన జీవితానికి పునాదులని తెలిపారు. ఇలాంటి అవగాహన కార్యక్రమాలు విద్యార్థుల్లో ఆరోగ్య చైతన్యాన్ని పెంపొందిస్తాయని ఆయన అభిప్రాయపడ్డారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన డీన్ స్టూడెంట్ అఫైర్స్ కార్యాలయం, మైక్రోబయాలజీ విభాగాన్ని ఆయన అభినందించారు.

**క్యాన్సర్‌పై అపోహలకు చెక్ - డా. ఏ. నిఖిల్ కుమార్**

కీలకోపన్యాసం చేసిన డా. ఏ. నిఖిల్ కుమార్, ఎం.డి. (రేడియేషన్ ఆంకాలజీ), అసిస్టెంట్ ప్రొఫెసర్, కాకతీయ మెడికల్ కాలేజ్, వరంగల్ మాట్లాడుతూ క్యాన్సర్ గురించి సమాజంలో ఉన్న అనేక అపోహలను శాస్త్రీయంగా ఖండించారు. క్యాన్సర్ ఎప్పుడూ ప్రాణాంతకం కాదని, ప్రారంభ దశలో గుర్తిస్తే సరైన చికిత్స ద్వారా దీర్ఘకాలం జీవించవచ్చని వివరించారు. క్యాన్సర్ స్పర్శ ద్వారా లేదా మాట్లాడటం ద్వారా వ్యాపిస్తుందన్న భావన తప్పని, ఇది అంటువ్యాధి కాదని స్పష్టం చేశారు. ఒత్తిడి నేరుగా క్యాన్సర్‌కు కారణం కాకపోయినా, రోగిని ఎదుర్కొనే శక్తిని తగ్గిస్తుందని చెప్పారు. వృద్ధులకే క్యాన్సర్ వస్తుందన్న అభిప్రాయం కూడా తప్పని, పిల్లలు, యువతలో కూడా ల్యూకేమియా, సార్కోమా వంటి క్యాన్సర్లు వస్తాయని వివరించారు. శస్త్రచికిత్స లేదా బయాప్సీ వల్ల క్యాన్సర్ వ్యాపిస్తుందన్న భయం అపోహ మాత్రమేనని, ఇవి చికిత్సలో కీలకమైన దశలని పేర్కొన్నారు. పొగతాగేవారికే క్యాన్సర్ వస్తుందన్నది తప్పని, అయితే పొగాకు వాడకం ప్రమాదాన్ని గణనీయంగా పెంచుతుందని హెచ్చరించారు. మద్యం ఏ మోతాదులోనైనా క్యాన్సర్ ప్రమాదాన్ని పెంచుతుందని తెలిపారు. లక్షణాలు రాకముందే స్క్రీనింగ్ పరీక్షలు (మామోగ్రఫీ, పాప్ స్మియర్ తదితరాలు) చేయించుకోవడం ద్వారా క్యాన్సర్‌ను ముందుగానే గుర్తించి ప్రాణాలను కాపాడవచ్చని ఆయన వివరించారు. చివరగా, క్యాన్సర్ మరణశిక్ష కాదని, సరైన అవగాహన, జీవనశైలి మార్పులు, టీకాలు మరియు ఆధునిక వైద్యంతో దీన్ని నివారించవచ్చని ఆశాజనక సందేశం ఇచ్చారు.

**ఉచిత వైద్య శిబిరానికి భారీ స్పందన**

సమన్విత క్యాన్సర్ సెంటర్, డా. భగీరథ సహకారంతో జువాలజీ విభాగంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో రక్తపోటు, షుగర్ పరీక్షలు నిర్వహించారు. 150 మంది విద్యార్థులు ఉచిత పరీక్షలు చేయించుకున్నారని యూత్ వెల్ఫేర్ ఆఫీసర్ ప్రొ. మామిడాల ఇస్తారి తెలిపారు. సంఘటన నిర్వహణ ఈ కార్యక్రమానికి కన్వీనర్‌గా మైక్రోబయాలజీ విభాగాధిపతి డా. ఎడ్ల సుజాత, కో-ఆర్డినేటర్‌గా డా. రాధిక, ఫ్యాకల్టీ కోఆర్డినేటర్‌గా డా. వెంకట గోపీనాథ్ వ్యవహరించారు. అసిస్టెంట్ ప్రొఫెసర్లు డా. ముంజం శ్రీనివాస్, డా. వెంకటయ్య, డా. సూర్యం, డా. ప్రణీత, డా. చంద్రశేఖర్, డా. ఆశీర్వాదం, డా. పోరిక మహేందర్, డా. నాగేశ్వర్, డా. రాధిక రాణి, డా. ప్రగతి రెడ్డితో పాటు అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.


# విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించిన ఎస్ఐ సునంద



**మహబూబాబాద్. జై భీమ్ న్యూస్**

మహబూబాబాద్ జిల్లా ఎస్పీ డా. శబరీష్ ఐపీఎస్ ఆదేశాల మేరకు మహబూబాబాద్ షీ టీం ఆధ్వర్యంలో తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ అండ్ జూనియర్ కాలేజ్, మహబూబాబాద్ నందు విద్యార్థినులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని షీ టీం ఎస్సై సునంద నేతృత్వంలో నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ప్రస్తుత సమాజ పరిస్థితుల్లో బాలికలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని వివరించారు. షీ టీం విధులు, భరోసా సెంటర్ సేవలు, సైబర్ నేరాలు, సోషల్ మీడియా భద్రత వంటి అంశాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఈ సదస్సుకు సుమారు 350 మంది విద్యార్థినులు హాజరయ్యారు. అలాగే బాలికల భద్రతకు సంబంధించిన చైల్డ్ హెల్ప్‌లైన్ నంబర్ 1098, సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ 1930, అత్యవసర నంబర్లు 100/112 వినియోగం గురించి వివరించారు. అపరిచితుల పట్ల జాగ్రత్తలు, గుడ్ టచ్ — బ్యాడ్ టచ్ అవగాహన, ట్రాఫిక్ నియమాలు మరియు ~= కోడ్ వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు అందించారు. షీ టీం వాట్సాప్ నంబర్ 8712656935 ద్వారా సహాయం పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ బత్తుల విజయ కుమారి, అధ్యాపక సిబ్బంది, షీ టీం సిబ్బంది మరియు భరోసా సిబ్బంది పాల్గొన్నారు. బాలికల రక్షణ మరియు భద్రత కోసం ఇలాంటి అవగాహన కార్యక్రమాలు నిరంతరం నిర్వహించనున్నట్లు షీ టీం అధికారులు వెల్లడించారు.

# నాచారం కార్పొరేటర్ శాంతి సైజెన్ శేఖర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన బరిగెల శివ





**హైద్రాబాద్, ఫిబ్రవరి 4, 2026 (జై భీమ్ న్యూస్)**

నాచారం సీనియర్ బీఆర్‌ఎస్ నేత, నాచారం కార్పొరేటర్ శాంతి సైజెన్ శేఖర్ జన్మదినాన్ని పురస్కరించుకొని పలువురు ప్రజాప్రతినిధులు, సామాజిక నాయకులు, మీడియా ప్రతినిధులు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా జై భీమ్ సంస్థల ఫౌండర్, చైర్మన్ డాక్టర్ బరిగెల శివ ప్రత్యేక ప్రకటన విడుదల చేశారు. డాక్టర్ బరిగెల శివ మాట్లాడుతూ, శాంతి సైజెన్ శేఖర్ నాచారం ప్రజల కోసం నిరంతరం అంకితభావంతో పనిచేస్తూ ప్రజాసేవను తన జీవిత లక్ష్యంగా కొనసాగిస్తున్నారని ప్రశంసించారు. సమస్యల పరిష్కారం, మౌలిక వసతుల అభివృద్ధి, పేద ప్రజల సంక్షేమం వంటి అంశాలలో ఆయన చేసిన కృషి అభినందనీయమని పేర్కొన్నారు. నాచారం ప్రాంతంలో రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్యం వంటి మౌలిక సదుపాయాల అభివృద్ధితో పాటు, సామాజిక సంక్షేమ పథకాలు ప్రజలకు చేరేలా ఆయన చేసిన ప్రయత్నాలు ప్రజల మనసులను గెలుచుకున్నాయని తెలిపారు. ప్రజల మధ్య ఉండి వారి కష్టసుఖాల్లో భాగస్వామిగా వ్యవహరించే నాయకుడిగా శాంతి సైజెన్ శేఖర్ కి ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. ఈ సందర్భంగా శాంతి సైజెన్ శేఖర్ కి ఆరోగ్యం, దీర్ఘాయుష్షు, ప్రజల ప్రేమాభిమానాలతో నిండిన జీవితాన్ని భగవంతుడు ప్రసాదించాలని, రాజకీయంగా మరిన్ని ఉన్నత స్థాయిలకు ఎదిగి నాచారం ప్రజల సేవలో మరింతగా ముందుకు సాగాలని డాక్టర్ బరిగెల శివ ఆకాంక్షించారు. జన్మదిన శుభాకాంక్షల కార్యక్రమంలో జై భీమ్ సంస్థల ప్రతినిధులు, తోటి మీడియా మిత్రులు కూడా పాల్గొని శాంతి సైజెన్ శేఖర్ కి శుభాకాంక్షలు తెలిపారు. నాచారం ప్రజల అభివృద్ధికి అంకితమై పనిచేస్తున్న నాయకుడిగా ఆయన మరిన్ని విజయాలు సాధించాలని అందరూ ఆకాంక్షించారు.

# ఘనంగా కమలాపూర్‌లో ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం







**అవగాహన ర్యాలీతో ప్రజల్లో చైతన్యం**

**కమలాపూర్, 4 ఫిబ్రవరి 2026 (జై భీమ్ న్యూస్)**

ప్రపంచవ్యాప్తంగా క్యాన్సర్‌పై అవగాహన పెంచి, ముందస్తు గుర్తింపు మరియు నివారణపై ప్రజలను చైతన్యపరిచే లక్ష్యంతో జరుపుకునే ప్రపంచ క్యాన్సర్ దినోత్సవాన్ని కమలాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీ.హెచ్.సి) ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో భారీ అవగాహన ర్యాలీ నిర్వహించి, క్యాన్సర్ పట్ల ఉన్న అపోహలు, భయాలను తొలగిస్తూ ప్రజల్లో ఆరోగ్య చైతన్యాన్ని నింపే ప్రయత్నం చేశారు. ర్యాలీని ఉద్దేశించి కమలాపూర్ పీ.హెచ్.సి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నాగరాజు మాట్లాడుతూ, క్యాన్సర్ అనేది తప్పనిసరిగా మరణానికి దారి తీసే వ్యాధి కాదని, ముందస్తుగా గుర్తిస్తే 70 నుంచి 90 శాతం వరకు పూర్తిగా నయం చేసే అవకాశాలు ఉన్నాయని స్పష్టంగా తెలిపారు. అయితే నిర్లక్ష్యం, అవగాహన లోపం వల్ల చాలామంది చివరి దశలో ఆసుపత్రులకు చేరుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే ప్రజలు లక్షణాలను గుర్తించి, సమయానికి వైద్య పరీక్షలు చేయించుకోవడం అత్యంత కీలకమని చెప్పారు. ప్రత్యేకంగా మహిళల ఆరోగ్యంపై దృష్టి సారిస్తూ, 30 ఏళ్లు దాటిన మహిళలు తప్పనిసరిగా రొమ్ము (బ్రెస్ట్) క్యాన్సర్ మరియు గర్భాశయ (సర్వికల్) క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు క్రమం తప్పకుండా చేయించుకోవాలని ఆయన సూచించారు. ఈ పరీక్షల ద్వారా క్యాన్సర్‌ను ప్రారంభ దశలోనే గుర్తించి, తక్కువ ఖర్చుతో, తక్కువ బాధతో చికిత్స చేయించుకోవచ్చని వివరించారు. అదేవిధంగా జీవనశైలిలో మార్పులు కూడా క్యాన్సర్ నివారణలో కీలక పాత్ర పోషిస్తాయని డాక్టర్ నాగరాజు పేర్కొన్నారు. ధూమపానం, మద్యం వంటి దురలవాట్లకు దూరంగా ఉండడం, పౌష్టికాహారం తీసుకోవడం, పండ్లు, కూరగాయలు అధికంగా వినియోగించడం, నిత్య వ్యాయామం చేయడం ద్వారా క్యాన్సర్ ముప్పును గణనీయంగా తగ్గించుకోవచ్చని ప్రజలకు సూచించారు. ఈ అవగాహన కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ రవీందర్, స్టాఫ్ నర్స్ సరిత, టిబి మోడల్ పర్సన్ ప్రభాకర్, ఏఎన్ఎం శశికళ, ఆశా కార్యకర్తలు, ప్రైమరి హెల్త్ సెంటర్ వైద్య సిబ్బంది, అలాగే స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పాల్గొన్నవారు ప్లకార్డులు చేతబట్టి గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ర్యాలీ నిర్వహిస్తూ, "క్యాన్సర్‌ను జయిద్దాం -- ఆరోగ్యంగా ఉందాం", "ముందస్తు పరీక్షలే మన రక్షణ" వంటి నినాదాలతో ప్రజలను చైతన్యపరిచారు. ఈ ఏడాది ప్రపంచ క్యాన్సర్ దినోత్సవ నినాదం "యునైటెడ్ బై యూనిక్" అని, ప్రతి క్యాన్సర్ రోగి అవసరాలకు అనుగుణంగా వ్యక్తిగత సంరక్షణ, నాణ్యమైన చికిత్స అందించడమే దీని ముఖ్య ఉద్దేశమని డాక్టర్ నాగరాజు తెలిపారు. క్యాన్సర్‌ను ఒంటరిగా ఎదుర్కొనే వ్యాధిగా కాకుండా, సమాజం మొత్తం కలిసి పోరాడాల్సిన సమస్యగా చూడాలని ఆయన పిలుపునిచ్చారు. మొత్తంగా కమలాపూర్ ప్రైమరి హెల్త్ సెంటర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ర్యాలీ గ్రామ ప్రజల్లో క్యాన్సర్‌పై అవగాహన పెంచడంలో, భయాన్ని తొలగించి పరీక్షల వైపు ప్రోత్సహించడంలో కీలక పాత్ర పోషించిందని స్థానికులు అభిప్రాయపడ్డారు.

# ఎస్ఐఆర్ మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతం చేయండి

**హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్**

**హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లో వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో ఎస్ఐఆర్ మ్యాపింగ్ ప్రక్రియ పై వెరిఫికేషన్ అధికారులతో కలెక్టర్ సమీక్షా**



**హన్మకొండ, 4 ఫిబ్రవరి 2026(జై భీమ్ న్యూస్)**

వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో చేపట్టిన ఎస్ఐఆర్ మ్యాపింగ్ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని వెరిఫికేషన్ అధికారులను హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ ఆదేశించారు. బుధవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో ఎస్ఐఆర్ మ్యాపింగ్ ప్రక్రియ పై వెరిఫికేషన్ అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలోని ఇరవై పోలింగ్ కేంద్రాలలో 2002 ఓటర్ల జాబితాను 2025 ఓటర్ల జాబితాతో బీఎల్వోలు ఓటర్ల జాబితాను ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) మ్యాపింగ్ చేస్తున్న ప్రక్రియపై వెరిఫికేషన్ అధికారులుగా నియమితులైన జిల్లా అధికారులతో కలెక్టర్ సమీక్షించారు.
క్షేత్రస్థాయిలో మ్యాపింగ్ చేస్తున్న విధానం, ఏవైనా ఇబ్బందులు ఎదురవుతున్నాయా, వెరిఫికేషన్ అధికారులుగా పరిశీలించిన అంశాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ బీఎల్వోలు ఆయా పోలింగ్ కేంద్రాల వారీగా క్షేత్రస్థాయిలో ఇంటింటికి వెళ్లి ఎస్ఐఆర్ మ్యాపింగ్ వేగవంతంగా చేసేవిధంగా చర్యలు చేపట్టాలని వెరిఫికేషన్ అధికారులకు తెలియజేశారు. బీఎల్వోలుగా ఉన్నవారు క్షేత్రస్థాయిలో పనిచేస్తున్నారా లేదా పరిశీలించాలని ఆర్డీవో రాథోడ్ రమేష్ ను ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల వారీగా 2002 ఓటర్ల జాబితాను 2025 జాబితాతో ఎస్ఐఆర్ మ్యాపింగ్ చేయడం లో బీఎల్వోలు కీలకంగా పనిచేసేవిధంగా వెరిఫికేషన్ అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. తక్కువగా ఉన్న 20 పోలింగ్ కేంద్రాలతో పాటు అదనంగా 80 పోలింగ్ కేంద్రాలలో ఈ ప్రక్రియ ను మరింత వేగవంతం చేసేందుకు జిల్లా అధికారులను కేటాయించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి, హనుమకొండ ఆర్డీవో రాథోడ్ రమేష్, వెరిఫికేషన్ అధికారులు డీఆర్డీవో మేన శ్రీను, డీఎంహెచ్ఓ డాక్టర్ అప్పయ్య, పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ నవీన్ కుమార్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ బాలరాజు, ఉద్యాన శాఖ అధికారి అనసూయ, ఇంచార్జి డీడబ్ల్యూవో విశ్వజ, మెప్మా కో ఆర్డినేటర్ రజితా రాణి, డీఎల్పీవో గంగా భవాని, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ జగత్ సింగ్, హనుమకొండ తహసీల్దార్ రవీందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్ నిర్వహించిన ఇన్స్పెక్టర్ గట్ల మహేందర్ రెడ్డి



**మహబూబాబాద్. జై భీమ్ న్యూస్**

మున్సిపాలిటి ఎన్నికల్లో ప్రజలు భయం లేకుండా, స్వేచ్ఛగా, ప్రశాంత వాతావరణంలో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని మహబూబాబాద్ టౌన్ ఇన్‌స్పెక్టర్ గట్ల మహేందర్ రెడ్డి అన్నారు. మున్సిపల్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా జిల్లా ఎస్పీ డా. శబరిష్. ఆదేశాల మేరకు డీఎస్పీ తిరుపతిరావు సూచనల ప్రకారం టౌన్ పోలీసుల ఆధ్వర్యంలో బుధవారం 20 మంది రౌడీషీటర్లను మహబూబాబాద్ ఎమ్మార్వో సమక్షంలో బైండోవర్ చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు పాల్పడకుండా ఉండాలనే షరతులతో ఎమ్మార్వో నుండి షూరిటీ తీసుకుని సెల్ఫ్ షూరిటీపై విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో టౌన్ ఎస్సై లు అరుణ్ కుమార్, ప్రశాంత్ బాబు, . షాకీర్, మౌనిక మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# అంబటి రాంబాబు ఇంటికి వెళ్లిన జగన్

**గుంటూరు, జై భీమ్ న్యూస్**

గుంటూరులో మాజీ మంత్రి అంబటి రాంబాబు కుటుంబాన్ని వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన కూటమి ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఖూనీ అయిపోయిందని, జంగిల్ రాజ్ నడుస్తోందని జగన్ తీవ్రంగా విమర్శించారు. దాడులు చేసిన వారిని వదిలేసి, బాధితులపైనే కేసులు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం నాడు గుంటూరు పర్యటనలో భాగంగా, ఇటీవల దాడికి గురైన అంబటి నివాసానికి వెళ్లిన జగన్, ధ్వంసమైన ఇంటిని, వాహనాలను పరిశీలించారు. గుడి నుంచి వస్తున్న అంబటిపై టీడీపీ కార్యకర్తలు కర్రలు, రాడ్లతో దాడి చేశారని, పోలీసుల సమక్షంలోనే కార్లను పగలగొట్టారని ఆరోపించారు. బాధితుడైన అంబటిని అరెస్ట్ చేసి, దాడి చేసిన వారికి స్టేషన్ బెయిల్ ఇవ్వడం దారుణమని అన్నారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ, "ఇలాంటి దాడులతో వైసీపీ నాయకులను భయపెట్టగలమనుకుంటే మీ అంత మూర్ఖుడు లేడు. ఎల్లకాలం ఇదే ప్రభుత్వం ఉండదు. మూడేళ్లలో మా ప్రభుత్వం వస్తుంది. అప్పుడు వడ్డీతో సహా చెల్లిస్తాం" అంటూ చంద్రబాబు ప్రభుత్వానికి ఘాటు వార్నింగ్ ఇచ్చారు. చేసిన తప్పులకు చంద్రబాబు, పవన్ కల్యాణ్, నారా లోకేశ్ లెక్కలు చెల్లించాల్సి ఉంటుందని హెచ్చరించారు. అనంతరం తిరుమల నెయ్యి వివాదంపై కూడా జగన్ స్పందించారు. నెయ్యిలో ఎలాంటి కల్తీ జరగలేదని ల్యాబ్ నివేదికలు స్పష్టం చేశాయని, కేవలం తిరుమల ప్రతిష్ఠను దెబ్బతీసేందుకే చంద్రబాబు కుట్రపూరితంగా తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు.

# జిమ్‌లలో ఏం జరుగుతోందో చూడండి

**రాష్ట్రాలకు ఎన్ హెచ్ఆర్సీ నోటీసులు**

**జిమ్‌ల ముసుగులో యువతులకు వల**

**ఫిట్‌నెస్ సెంటర్లలో అకృత్యాలు**

**అన్ని రాష్ట్రాలు, కేంద్రానికి నోటీసులు జారీ చేసిన ఎన్ హెచ్ఆర్సీ**

**యూపీలోని మీర్జాపూర్‌లో 50 మందికి పైగా బాధితులని ఫిర్యాదు**

**జిమ్‌ల నిబంధనలపై నివేదిక కోరిన మానవ హక్కుల కమిషన్**

**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

దేశవ్యాప్తంగా ఉన్న జిమ్‌లు, ఫిట్‌నెస్ సెంటర్ల ముసుగులో యువతులపై లైంగిక దోపిడీ, బలవంతపు మతమార్పిడులు జరుగుతున్నాయన్న తీవ్రమైన ఆరోపణలపై జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్ హెచ్ఆర్సీ) తీవ్రంగా స్పందించింది. ఈ వ్యవహారంపై సమగ్ర నివేదికలు ఇవ్వాలని కోరుతూ అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల ప్రధాన కార్యదర్శులకు, కేంద్ర క్రీడలు–యువజన వ్యవహారాల మంత్రిత్వ శాఖకు, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (సాయ్)కు నోటీసులు జారీ చేసింది. ఈ ఆరోపణలు నిజమైతే, బాధితుల మానవ హక్కులకు తీవ్ర భంగం వాటిల్లినట్లేనని కమిషన్ అభిప్రాయపడింది. ఉత్తరప్రదేశ్‌లోని మీర్జాపూర్‌లో ఓ జిమ్ కేంద్రంగా భారీ దోపిడీ రాకెట్ పనిచేస్తోందని, యువతులే లక్ష్యంగా ఈ దారుణాలు జరుగుతున్నాయని ఓ ఫిర్యాదుదారుడు ఎన్ హెచ్ఆర్సీని ఆశ్రయించారు. మీడియా కథనాల ప్రకారం, ఈ ముఠా వలలో దాదాపు 50 మందికి పైగా యువతులు చిక్కుకున్నారని, ఈ రాకెట్‌లో ఏకంగా ఓ పోలీసు అధికారికి ప్రత్యక్ష ప్రమేయం ఉందని ఫిర్యాదులో పేర్కొన్నారు. చట్టాన్ని రక్షించాల్సిన పోలీసు అధికారి ప్రమేయం ఉండటం అధికార దుర్వినియోగానికి, శాంతిభద్రతల వైఫల్యానికి, ప్రజల నమ్మకాన్ని దెబ్బతీయడానికి నిదర్శనమని ఫిర్యాదుదారుడు ఆవేదన వ్యక్తం చేశారు. ఇది మహిళల భద్రతకు, మత స్వేచ్ఛకు తీవ్ర విఘాతం కలిగిస్తుందని తెలిపారు. ఫిట్‌నెస్ కేంద్రాల ముసుగులో వ్యవస్థీకృత నేర ముఠాలు పనిచేస్తున్నాయనడానికి ఈ ఘటనే నిదర్శనమని ఆరోపించారు. ఈ ఘటనపై స్వతంత్ర దర్యాప్తు జరిపించాలని, బాధితులకు రక్షణ కల్పించి పునరావాసం కల్పించాలని, నిందితుడైన పోలీసు అధికారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదుదారుడు కోరారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా దేశవ్యాప్తంగా జిమ్‌లు, ఫిట్‌నెస్ సెంటర్ల కోసం కఠినమైన నియంత్రణ మార్గదర్శకాలు రూపొందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ ఫిర్యాదును ఎన్ హెచ్ఆర్సీ సభ్యులు ప్రియాంక్ కనూంగో నేతృత్వంలోని బెంచ్ సుమోటోగా స్వీకరించింది. మానవ హక్కుల పరిరక్షణ చట్టం–1993లోని సెక్షన్ 12 ప్రకారం చర్యలు చేపట్టింది. తమ పరిధిలోని జిమ్‌లు, ఫిట్‌నెస్ సెంటర్ల ఏర్పాటు, నిర్వహణకు సంబంధించి ప్రస్తుతం ఉన్న మార్గదర్శకాలు, రిజిస్ట్రేషన్ నిబంధనలు, ప్రమాణాలపై నివేదిక సమర్పించాలని అన్ని రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులను ఆదేశించింది. దేశంలో జిమ్‌ల కోసం ఏమైనా జాతీయ విధానాలు ఉన్నాయా అనే వివరాలు ఇవ్వాలని కేంద్ర క్రీడా మంత్రిత్వ శాఖను, లైసెన్సింగ్ అవసరాలపై సమాచారం ఇవ్వాలని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా డైరెక్టర్ జనరల్‌ను కోరింది. ప్రత్యేకంగా మీర్జాపూర్ ఘటనపై లోతైన విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని అక్కడి జిల్లా మేజిస్ట్రేట్, ఎస్పీని ఆదేశించింది. సంబంధిత అధికారులు రెండు వారాల్లోగా తమ నివేదికలను సమర్పించాలని స్పష్టం చేసింది.

జై భీమ్ తెలుగు దినపత్రిక
POWER OF PEOPLE





# పవన్ కల్యాణ్ 'ఉస్తాద్ భగత్ సింగ్' రిలీజ్ డేట్ ఇదే

**పవన్ కళ్యాణ్ 'ఉస్తాద్ భగత్ సింగ్' విడుదల తేదీ ఖరారు**
**2026 మార్చి 26న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్ రిలీజ్**
**గబ్బర్ సింగ్ తర్వాత హరీశ్ శంకర్‌తో పవన్ చేస్తున్న సినిమా**
**మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్ పై నిర్మాణం**
**రిలీజ్ డేట్ ప్రకటనతో అభిమానుల్లో పెరిగిన ఉత్సాహం**

పవర్ స్టార్ పవన్ కల్యాణ్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'ఉస్తాద్ భగత్ సింగ్' సినిమా విడుదల తేదీని చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. ఈ చిత్రాన్ని మార్చి 26న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి తీసుకురానున్నట్లు వెల్లడించింది. ఈ మేరకు నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ సోషల్ మీడియా ద్వారా ఓ పోస్టర్‌ను విడుదల చేసింది. 'గబ్బర్ సింగ్' వంటి ఇండస్ట్రీ హిట్ తర్వాత పవన్ కల్యాణ్, దర్శకుడు హరీశ్ శంకర్ కాంబినేషన్‌లో వస్తున్న సినిమా కావడంతో దీనిపై మొదటి నుంచి భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ క్రేజీ కాంబోలో సినిమా వస్తుండటంతో అభిమానులు ఎంతో ఉత్సాహంగా ఎదురుచూస్తున్నారు. తాజాగా విడుదల తేదీని ప్రకటించడంతో వారి ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. ఈ సినిమాలో పవన్ సరసన టాలీవుడ్ క్రేజీ హీరోయిన్ శ్రీలీల నటిస్తుండగా, రాశీ ఖన్నా మరో కీలక పాత్రలో కనిపించనుంది. రాక్ స్టార్ దేవి శ్రీ ప్రసాద్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. వేసవి సీజన్‌ను టార్గెట్ చేస్తూ విడుదల తేదీని ప్రకటించడంతో పవర్ స్టార్ అభిమానులు సోషల్ మీడియాలో సంబరాలు చేసుకుంటున్నారు. చఖదీూాఅమీుతీఎష్ట్ర26ష్ట్ర అనే హ్యాష్‌ట్యాగ్‌తో ఈ వార్తను ట్రెండ్ చేస్తున్నారు.

# ఇంట్లోకి చొరబడి మరీ కొడుతుంది... ధురంధర్-2 టీజర్ వచ్చేసింది

**విడుదలైన రణ్‌వీర్ సింగ్ 'ధురంధర్: ది రివెంజ్' టీజర్**
**2026 మార్చి 19న పాన్ ఇండియా స్థాయిలో థియేటర్లలో విడుదల**
**భారీ విజయం సాధించిన 'ధురంధర్' చిత్రానికి సీక్వెల్‌గా ఈ సినిమా**
**ఆదిత్య ధర్ దర్శకత్వం**




బాలీవుడ్ స్టార్ రణ్‌వీర్ సింగ్ మరోసారి తన భీకరమైన అవతారంతో ప్రేక్షకులను పలకరించేందుకు సిద్ధమయ్యాడు. 'ధురంధర్' మొదటి భాగం సృష్టించిన రికార్డుల తర్వాత, దాని సీక్వెల్ 'ధురంధర్ 2: ది రివెంజ్' టీజర్ విడుదలైంది. టీజర్ చివర్లో రణ్‌వీర్ పలికే "యే నయా హిందుస్థాన్ హై. యే ఘర్ మే ఘుసేగా భీ ఔర్ మారేగా భీ" (ఇది కొత్త హిందుస్థాన్. ఇంట్లోకి చొరబడి మరీ కొడుతుంది) అనే డైలాగ్ ప్రధాన ఆకర్షణగా నిలిచింది. ఇదే డైలాగ్‌ను దర్శకుడు ఆదిత్య ధర్ తన గత బ్లాక్‌బస్టర్ 'యూరి: ది సర్జికల్ స్ట్రైక్'లో ఉపయోగించడం విశేషం. ఒక నిమిషం 12 సెకన్ల నిడివి ఉన్న ఈ టీజర్‌లో, రణ్‌వీర్ పోషిస్తున్న హమ్జా అలీ మజారీ పాత్ర యవ్వనంలోని జీవితాన్ని చూపించారు. పాకిస్థాన్‌లోని ల్యారీ టౌన్‌ను శాసించే ఓ క్రూరమైన గ్యాంగ్‌లో అతను ఎలా ఎదిగాడో, స్పైగా మారకముందు అతని నేపథ్యం ఏమిటో ఈ టీజర్ తెలియజేస్తోంది. టీజర్‌తో పాటు "అబ్ బిగడ్నే కా వక్త్ ఆ గయా హై" అనే క్యాప్షన్‌తో ఓ కొత్త పోస్టర్‌ను కూడా విడుదల చేశారు. ఆదిత్య ధర్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తుండగా, సంజయ్ దత్, ఆర్. మాధవన్, అర్జున్ రాంపాల్ వంటి భారీ తారాగణం నటిస్తోంది. మొదటి భాగంలో చనిపోయిన అక్షయ్ ఖన్నా పాత్ర ఫ్లాష్‌బ్యాక్ సన్నివేశాల్లో కనిపించనుంది. జియో స్టూడియోస్, బీ62 స్టూడియోస్, ఆదిత్య ధర్ ఫిలిమ్స్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. హిందీతో పాటు తెలుగు, తమిళం, కన్నడ, మలయాళ భాషల్లో ఈ సినిమా విడుదల కానుంది. గతేడాది డిసెంబర్‌లో విడుదలైన 'ధురంధర్' మొదటి భాగం ప్రపంచవ్యాప్తంగా రూ. 1,320 కోట్లు వసూలు చేసి సంచలనం సృష్టించింది. ఇప్పుడు 'ధురంధర్ 2' చిత్రాన్ని మార్చి 19న విడుదల చేయనున్నట్టు ప్రకటించారు.



# కయదు లోహర్ ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను మేకర్స్ రిలీజ్

హీరో టొవినో థామస్ నటిస్తున్న భారీ బడ్జెట్ మూవీ 'పళ్లిచట్టంబి'. వరల్డ్ వైడ్ ఫిలిమ్స్, సి క్యూబ్ బ్రోస్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్స్ పై నౌఫల్, బ్రిజీష్, చాణుక్య చైతన్య చరణ్ నిర్మిస్తున్నారు. డిజో జోస్ ఆంటోనీ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో కయదు లోహర్ హీరోయిన్‌గా నటిస్తోంది. తాజాగా నాయిక కయదు లోహర్ ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను మేకర్స్ రిలీజ్ చేశారు. 'డ్రాగన్' మూవీ సక్సెస్ తర్వాత ఆడియెన్స్‌లో పెరిగిన ఆమె క్రేజ్ ఈ సినిమాకు ప్రత్యేక ఆకర్షణ కానుంది. ఇటీవలే ఐదు భాషల్లో రిలీజ్ చేసిన ఈ చిత్ర మోషన్ పోస్టర్‌కు హ్యూజ్ రెస్పాన్స్ వచ్చింది. ఈ మూవీ ఏప్రిల్ 9న హిందీ, తమిళ, తెలుగు, మలయాళ, కన్నడ ఐదు భాషల్లో గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రాబోతోంది. 50, 60 దశకాల నేపథ్యంగా సాగే ఈ పీరియాడిక్ మూవీలో హీరో టొవినో థామస్ ఇప్పటిదాకా చూడని విధంగా సరికొత్తగా కనిపించనున్నారు. దీంతో ఈ సినిమాపై పాన్ ఇండియా స్థాయిలో భారీ అంచనాలు ఏర్పడ్డాయి. విజయరాఘవన్, సుధీర్ కరమన, బాబురాజ్, వినోద్ కేదమంగళం, ప్రశాంత్ అలెగ్జాండర్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి మేకప్ -- రషీద్ అహ్మద్, ప్రొడక్షన్ డిజైన్ -- దిలీప్ నాథ్, ఎడిటింగ్ -- శ్రీజిత్ సరంగ్, సినిమాటోగ్రఫీ -- టిజో టోమీ, మ్యూజిక్ -- జేక్స్ బిజోరు, స్క్రిప్ట్ -- ఎస్ సురేష్ బాబు, అసోసియేట్ ప్రొడ్యూసర్స్ -- మేఘశ్యామ్, తంజీర్, ప్రొడ్యూసర్స్ -- నౌఫల్, బ్రిజీష్, చాణుక్య చైతన్య చరణ్, డైరెక్టర్ -- డిజో జోస్ ఆంటోనీ.